నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 5-10-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 55 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

జైత్రయాత్రలు
యాత్రల ప్రతి ఫలం
ప్రధాని పీఠం.

చెమటతడి
కాపుకుతగ్గశ్రమ
దక్కని ఫలం.

శాస్త్ర విద్యలు
లాభాల ఫలసారం
మార్పు కు రూపం.

తెల్లపావురం
తెలుపు వలువలు
మైల మరక.

రాయని పత్రం
ప్రజాస్వామ్య పాఠాలు
చేదు మాత్రలు

– రేడియమ్
సెల్: 9291527757

నిజాయి

తెలంగాణ రాష్ట్ర సమితి
పాకుతుంది దేశానికి !
ఆ పార్టీ చెప్పుతుంది
బిజెపి మార్పు కోసానికి !

దసరా రోజున తెరాస
జాతీయంగా పుట్టుక !
భిన్నజాతి భారతాన
ఇది రాగలదా నెట్టుక ?

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

కేసీఆర్‌కు మద్దతుగా క్రైస్తవ మత పెద్దల ఏకగ్రీవ తీర్మానం

నిజామాబాద్, అక్టోబర్ 4: జాతీయ పార్టీ ప్రకటిస్తున్న సీఎం కేసీఆర్‌కు మద్దతుగా నిజామాబాద్ సీఎస్ఐ చర్చిలో క్రైస్తవ మత పెద్దలు ఏకగ్రీవ తీర్మానం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ ఆధ్వర్యంలో బిషప్ సాల్మన్ రాయ్ మద్దతు ప్రకటించారు.

ఈ సందర్భంగా సాల్మన్ రాయ్ మాట్లాడుతూ.. కేసీఆర్ వెంటే తామంతా ఉంటామని స్పష్టం చేశారు. ఆ దేవుడి ఆశీస్సులు కేసీఆర్‌కు ఉండాలన్నారు. కేసీఆర్ లాంటి నాయకులు ఈ దేశానికి అవసరమని పేర్కొన్నారు. సెక్యులర్ దేశంగా భారత్ ఉండాలంటే కేసీఆర్ నాయకత్వం అవసరమని చెప్పారు. మతతత్వ పార్టీలతో దేశానికి ముప్పు ఉందన్నారు. దేశ రక్షణ కోసం మనమంతా కలిసి ఉండాలని సూచించారు. తెలంగాణ క్రైస్తవులందరూ కేసీఆర్ వెంటే ఉన్నారు. జాతీయ పార్టీ ప్రకటిస్తున్న నేపథ్యంలో కేసీఆర్‌కు శుభాంక్షాలు తెలియజేస్తూ.. దేవుడి ఆశీస్సులు ఉండాలని ప్రార్థిస్తున్నామని సాల్మన్ రాయ్ పేర్కొన్నారు.

పది పాసైన యువతకు ఇండియన్ నేవీలో ఉద్యోగాలు

హైదరాబాద్, అక్టోబర్ 4:పదో తరగతి పాసై ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నవారికి సువర్ణావకాశం. ఇలాంటి వారి కోసం ఇండియన్ నేవీ పలు ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదలను చేసింది. టెన్త్ పాసైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వీటిలో గ్రూప్ బీ కింద లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ క్లాసిఫైడ్స్, గ్రూప్ సీ కింద సివిలియన్ మోటార్ డ్రైవర్, స్టాఫ్ నర్స్ పోస్టులు ఉన్నాయి.

ఇండియన్ నేవీలో పదో తరగతి పాసైన వారి కోసం పలు ఉద్యోగాల భర్తీ చేపడుతున్నది. గ్రూప్ బీ కింద 6 లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ క్లాసిఫైడ్స్, గ్రూప్ సీ కింద 40 సివిలియన్ మోటార్ డ్రైవర్స్, 3 స్టాఫ్ నర్స్ పోస్టులను భర్తీ చేస్తున్నారు. దరఖాస్తులను పంపించిన అనంతరం షార్ట్‌లిస్ట్ చేయబడిన అర్హులైన అభ్యర్థులంతా వ్రాత పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ పరీక్షలో అభ్యర్థులు ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. సివిలియన్ మోటార్ డ్రైవర్ (ఆర్డినరీ గ్రేడ్) పోస్ట్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు డ్రైవింగ్ టెస్ట్ ఇవ్వాలి. దీనిలో ఉత్తీర్ణత సాధించిన తర్వాతే ఉద్యోగానికి ఎంపికవుతారు. ఎంపికైన అభ్యర్థులు వెస్టర్న్ నేవల్ కమాండ్ నియంత్రణలో ఉన్న ఏదైనా యూనిట్‌లో పని చేయాల్సి ఉంటుంది. అయితే, నౌకాదళం ఆవసరాల మేరకు దేశంలోని ఏదైనా నావికాదళ యూనిట్‌లోగానీ, నిర్మాణంలోగానీ సేవలందించేందుకు బదిలీలు ఉంటాయి.

స్టాఫ్ నర్స్ ? లెవెల్ 7 కింద రూ. 44,900 నుంచి రూ. 1,42,400, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్– లెవెల్ 6 కింద రూ. 35,400 నుంచి రూ. 1,12,400, సివిలియన్ మోటార్ డ్రైవర్– లెవెల్ 2 కింద రూ. 19,900 నుంచి రూ. 63,200 గా జీతభత్యాలు ఉంటాయి. అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తులను ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్–ఇన్–చీఫ్ (సీసీపీఓ కోసం), హెడ్‌క్వార్టర్స్, వెస్టర్న్ నేవల్ కమాండ్, బల్లార్డ్ ఎస్టేట్, టైగర్ గేట్ దగ్గర, ముంబై–400 001 చిరునామాకు పంపాల్సి ఉంటుంది.

సంతోషంగా, ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకోవాలి

మెదక్, అక్టోబర్ 3: నేటినిజం ప్రతినిధి):చెడుపై సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని, దసరా పండుగకు జిల్లా ప్రజలు కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ యెస్.హరీష్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగాజిల్లా ప్రజలకు కలెక్టర్ దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఏడాది పంటల దిగుబడులు బాగా వచ్చి రైతన్నల ఇల్లు ధాన్య రాశులలో నిండి పోవాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని, చేపట్టే ప్రతి కార్యక్రమంలో విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు.

డా॥అంబేద్కర్ పరినిర్మాణ్ భూమి సమ్మాన్ కమిటీ అడ్వజర్‌గా మౌలానా ఆజాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జీ.వీ. రత్నాకర్ నియామకం

హైదరాబాద్, అక్టోబర్ 4: ఫాదర్ ఆఫ్ మాడ్రన్ ఇండియా బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ రచనా సమయంలో ఢిల్లీలో నివసించిన గృహాన్ని దేశ ప్రజల కోసం స్మారక చిహ్నంగా ప్రకటించి అభివృద్ధి చేయాలని, జాతీయ స్థాయిలో రామ్ విలాస్ పాశ్వాన్, ఆర్పీఐ (ఎ) జాతీయ అధ్యక్షులు కేంద్రమంత్రి రామ్‌దాస్ అధవాలే వంటివారు ఇందుకోసం విశేషంగా కృషి చేశారు. ప్రస్తుతం దీనికి సంబంధించి న్యూఢిల్లీ కేంద్ర కార్యాలయంగా నడుస్తున్న డా॥ అంబేద్కర్ పరినిర్వాణ్ భూమి సమ్మాన్ కార్యక్రమ కమిటీలో ఆంధ్రప్రదేశ్ కమిటీ తరపున ముఖ్య సలహాదారులుగా ప్రముఖ కవి,రచయిత, అనువాదకులు హైదరాబాద్ మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్శిటీ హింది హెచ్.ఓ.డి. డాక్టర్ జి.వి.రత్నాకర్ నియమితలయ్యారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల అంబేద్కరైట్స్ డా॥ రత్నాకర్‌ను అభినందనలు జైభీముల వెల్లువలో ముంచెత్తుతున్నారు.

చరిత్రలో నేటినిజం

(అక్టోబర్ 5 నందూరు బాపిరాజు జయంతి..)

–రాధశ్రీ
సెల్:9494481210

19 మున్సిపాలిటీలకు రూ. 2 కోట్ల చొప్పున నిధులు : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 4:అద్భుతంగా పురోగతి సాధిస్తున్న గ్రామాలు, పట్టణాలను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనపై ఉన్నదని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. జాతీయస్థాయిలో స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులు సాధించిన 19 మున్సిపాలిటీలకు రూ. 2 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ నిధులను ప్రత్యేకంగా పారిశుధ్యం కోసం వినియోగించాలని విజ్ఞప్తి చేస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులు–2022 సాధించిన మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులు, కమిషనర్ల అభినందన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. బడంగ్‌పేట్, కోరుట్ల, సిరిసిల్ల, తుర్కయాంజాల్, గజ్వేల్, వేములవాడ, ఘట్‌కేసర్, కొంపల్లి, హుస్నాబాద్, ఆదిభట్ల, కొత్తపల్లి, చండూర్, నేరేడుచర్ల, చిట్యాల, భూత్‌పూర్, అలంపూర్, పీర్జాదిగూడ, కోరుట్లకు నిధులు మంజూరు చేయనున్నారు.

కేటీఆర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులు సాధించిన వారికి అభినందనలు. ఇదే స్ఫూర్తితో మరింత ముందుకు సాగాలన్నారు. దేశంలోనే అత్యధికంగా అవార్డులు సాధించి రెండవ స్థానంలో తెలంగాణ నిలిచిందన్నారు. ఈ అవార్డులు సాధించేందుకు కింది స్థాయిలో ఉన్న పారిశుద్ధ్య కార్మికురాలి నుంచి ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి దాక అందరూ కలిసి ఒకే రకమైన ఆలోచన విధానంతో పనిచేయడం వల్లనే సాధ్యమైనది. జాతీయస్థాయిలో ఇంత గొప్ప గుర్తింపు లభించిందని ప్రశంసించారు.

వారే అవార్డులు ఇస్తారు.. వారే విమర్శిస్తారు.. 20 ఉత్తమ గ్రామాల్లో 19 తెలంగాణలోనే ఉన్నాయని కేంద్రం చెబుతున్నదని కేటీఆర్ పేర్కొన్నారు. పట్టణాలకు అవార్డులు ప్రకటిస్తే దేశంలో రెండో స్థానంలో తెలంగాణలో నిలిచింది. దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లోకెల్లా అత్యుత్తమమైన రాష్ట్రం తెలంగాణ అని కేంద్రమే చెబుతుంది. కానీ ఇక్కడ పరిపాలన సరిగా లేదని అబద్ధాలను చెబుతుంది కూడా కేంద్రంలోని నాయకులే. అయితే ఇలాంటి అర్థరహిత విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఒకవైపు అవార్డులు, రివార్డులతో పాటు ప్రజల ప్రశంసలు వస్తున్నాయని పేర్కొన్నారు.

జపాన్, సింగపూర్‌కు స్టడీ టూర్‌కు పంపిస్తాం..

తెలంగాణలో స్థానిక సంస్థల విధులను నిర్ణయించడం, నిధులు మంజూరు చేయడం వల్లనే ఇంత ప్రగతి సాధ్యమైందని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో, మునిసిపాలిటీలో సర్పంచ్ ఉన్న ఏకైక రాష్ట్రము తెలంగాణ అని గర్వంగా చెప్పవచ్చు. ఈ రోజు తెలంగాణలోని పట్టణాలు, గ్రామాలు గొప్పగా మారాయి. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ వల్ల ఎంతో మంది అద్భుతమైన మహిళా నాయకులు పురపాలికలకు నాయకత్వం వహిస్తున్నారని గుర్తు చేశారు. అవార్డులు సాధించిన ఈ 19 పురపాలికలకు చెందిన చైర్పర్సన్లను, కమిషనర్లను, అడిషనల్ కలెక్టర్లను స్టడీ టూర్‌కు పంపించి, మరిన్ని ఉత్తమ పద్ధతులపైన అధ్యయనం చేసేందుకు అవకాశం కల్పిస్తాం. ఇందులోంచి పదిమందిని ఎంపిక చేసి జపాన్, సింగపూర్ కు అధ్యయనానికి పంపిస్తామని కేటీఆర్ తెలిపారు. పట్టణాలను ప్రజలు మాది అని భావించినప్పుడే అవి అద్భుతంగా అభివృద్ధి సాధిస్తాయి. ఆ దిశగా ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలను చేపట్టాలని కేటీఆర్ సూచించారు.

తెలంగాణ గోపాలమిత్రలకు శుభవార్త చెప్పిన మంత్రి తలసాని

హైదరాబాద్, అక్టోబర్ 4:రాష్ట్రంలోని గోపాలమిత్రలకు పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దసరాకు ముందే శుభవార్త చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు అందుబాటులో ఉండి.. తదితర కార్యక్రమాల్లో సేవలందిస్తున్న గోపాలమిత్రలకు గుర్తింపుగా తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తున్న పారితోషికానికి అదనంగా.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లిస్తున్న విధంగా 30 శాతం పెంచి, అదే రీతిలో గోపాలమిత్రలకు కూడా అందజేసే విధంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు.

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలలో భాగస్వాములవుతూ, గ్రామీణ ప్రాంతాలలోని రైతులకు అందుబాటులో ఉంటూ పాడి గేదెలకు కృత్రిమ గర్భాధారణ, వ్యాక్సినేషన్ కార్యక్రమాలు, నట్టల నివారణ మందుల పంపిణీ వంటి తదితర కార్యక్రమాలలో గోపాలమిత్రులు సేవలందిస్తున్న సంగతి తెలిసిందే.గోపాలమిత్రలకు ప్రస్తుతం రూ. 8,500 చెల్లిస్తుండగా, పెరిగిన 30 శాతంతో రూ. 2,550 కలుపుకొని మొత్తం రూ. 11,050 లకు పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న 1530 మంది గోపాలమిత్రలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు గోపాలమిత్రలకు రూ. 3,500ల పారితోషికాన్ని అందించే వారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత గోపాలమిత్రలు అందిస్తున్న సేవలను కేసీఆర్ గుర్తించి, ఒకేసారి రూ. 8,500లకు పెంచడం జరిగిందని తెలిపారు. దేశంలో ఎక్కడా కూడా ఇంత పెద్ద మొత్తంలో గోపాలమిత్రలకు /రాష్ట్ర అవసరాలకు సరిపడా పాల ఉత్పత్తిని మన రాష్ట్రంలోనే చేయాలి, నాణ్యమైన పాడి సంపదను పెంచాలనే ఉద్దేశంతో కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తుందని వివరించారు. 2019 నుండి జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమం కింద 14 లక్షల పశువులకు కృత్రిమ గర్భధారణ నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. అంతేకాకుండా విజయ డెయిరీకి పాల సేకరణను పెంచేందుకు చేపట్టిన కార్యక్రమంలో కూడా గోపాలమిత్రలు పాడి రైతులతో నేరుగా సంప్రదించి చేసిన కృషి ఫలితంగా పాల సేకరణ పెరిగిందని తెలిపారు. గోపాలమిత్రల నైపుణ్యాన్ని మరింతగా పెంపొందించే విధంగా ప్రతి 6 నెలలకు ఒకసారి తెలంగాణా వెటర్నరీ యూనివర్సిటీకి చెందిన నిపుణుల సహకారంతో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. రానున్న రోజులలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టే అనేక కార్యక్రమాలలో గోపాలమిత్రల సేవలను మరింతగా ఉపయోగించుకోనున్నట్లు చెప్పారు.

మహారాష్ట్రలో నకిలీ సీబీఐ అధికారుల గుట్టురట్టు

ముంబై, అక్టోబర్ 4: మహారాష్ట్ర రాజధాని ముంబైలో పోలీసులు నకిలీ సీబీఐ అధికారుల ఆటకట్టించారు. సీబీఐ అధికారులమంటూ ఓ వ్యాపారవేత్తను బెదిరించి రూ.5 లక్షలు డిమాండ్ చేసిన నలుగురు నిందితులను ముంబై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నలుగురు వ్యక్తులు గోరెగావ్‌లోని ఆస్ట్రిక్ ట్రేడింగ్ సెంటర్‌లోకి వెళ్లారు.

దాని యజమాని అయిన వ్యాపారికి తమను తాము సీబీఐ అధికారులుగా పరిచయం చేసుకుని, అతని అక్రమాలపై దర్యాప్తుకు వచ్చామని చెప్పారు. కేసు నుంచి బయటపడాలంటే రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యాపారికి నకిలీ సీబీఐ ఐడీ కార్డులు, పోలీస్ ఐడీ కార్డులు చూపించారు. వారి తీరును అనుమానించిన వ్యాపారి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దాంతో హుటాహుటిన ట్రేడింగ్ సెంటర్‌కు చేరుకున్న పోలీసులు నలుగురు నకిలీ సీబీఐ అధికారులను అక్కడే అరెస్ట్ చేశారు. దర్యాప్తులో నిందితులపై చాలా కేసులు ఉన్నట్లు తేలింది. గతంలో కూడా వాళ్లు ఇదే తరహాలో పలు నేరాలకు పాల్పడినట్లు వెల్లడైంది. ముంబైలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో వాళ్లపై కేసులు ఉన్నట్లు గుర్తించారు.

ఈ ముఠా ధనవంతులను లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడుతుందని పోలీసులు తెలిపారు. తాము టార్గెట్ చేసిన వ్యక్తి వివరాలు అన్నీ తెలుసుకుని, ఏవైనా లోపాలు దొరికితే పోలీస్ అధికారులుగా అతని ముందు ప్రత్యక్షమవుతారని, భయపెట్టి డబ్బు గుంజుతారని ముంబై పోలీసులు తెలిపారు.

భౌతికశాస్త్రంలో ముగ్గురికి ఈ ఏడాది నోబెల్ బహుమతి



న్యూఢిల్లీ, అక్టోబర్ 4: స్టాక్‌హోమ్: రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఇవాళ ఫిజిక్స్‌లో ఈ యేటి నోబెల్ బహుమతిని ప్రకటించింది. భౌతికశాస్త్రంలో ఈ సారి ముగ్గురికి ఆ అవార్డు దక్కింది. అలేన్ ఆస్పెక్ట్, జాన్ ఎఫ్ క్లాజర్, ఆంటోన్ జిలింగర్‌లను ఈ యేటి ఫిజిక్స్ నోబెల్ బహుమతి వరించింది. ఫోటాన్ల పరిశోధన, క్వాంటమ్ ఇన్‌ఫర్మేషన్ సైన్స్‌లో చేసిన ప్రయోగాలకు గాను ముగ్గురు శాస్త్రవేత్తలకు భౌతికశాస్త్ర నోబెల్ దక్కింది. ఈ ముగ్గురి శాస్త్రవేత్తల పరిశోధన ఆధారంగా క్వాంటమ్ ఇన్ఫర్మేషన్‌లో కొత్త టెక్నాలజీకి మార్గం సులువైంది. ప్రస్తుతం క్వాంటమ్ కంప్యూటర్స్, క్వాంటమ్ నెట్‌వర్క్స్, సెక్యూర్ క్వాంటమ్ ఇన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్‌లో విస్తృత స్థాయిలో పరిశోధనలు జరుగుతున్నాయి. పది మిలియన్ల స్వీడిష్ క్రోనర్లను ముగ్గురు శాస్త్రవేత్తలకు సమానంగా పంచనున్నారు.

నాణ్యతతో నిర్మాణ పనులు చేపట్టాలి : మంత్రి కొప్పుల

జగిత్యాల, అక్టోబర్ 4: ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు అందజేస్తున్న నిధులతో నాణ్యతతో కూడిన పనులు చేపట్టా లని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచించారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం చర్లపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. కాలనీలలో మురికి కాలువల నిర్మాణానికి రూ.20 లక్షల ప్రొసీడింగ్స్ లను గ్రామ ప్రజా ప్రతినిధులకు అందజేశారు.

వెల్గటూర్ మండలం గొడిషలపేట గ్రామంలో రెడ్డి సంఘ భవన నిర్మాణానికి రూ.10 లక్షల ప్రొసీడింగ్‌ను, మల్లన్నపేట గ్రామంలో గౌడ సంఘం, యాదవ సంఘం భవనాల నిర్మాణానికి రూ.10 లక్షల ప్రొసీడింగ్స్ లను అందజేశారు. పనులు శాశ్వతంగా ఉండాలంటే నాణ్యతతో చేపట్టాలని స్థానికులకు సూచించారు.

జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు –జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి, అక్టోబర్ 04 (నేటి నిజం ప్రతినిధి) విజయదశమి పండగ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా దసరా వేడుకలు జరుపుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ విజయదశమితో ప్రతి ఒక్కరూ చేపట్టిన పనులు విజయవంతమై, అందరికీ శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరూ విజయదశమి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. అన్ని రంగాలలో జిల్లాను అగ్రగామిగా నిలపడానికి అందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ శాసనసభ్యులు సుధాకర్ రావు

మహబూబాబాద్, అక్టోబర్ 4:(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండలంలోని పోచారం గ్రామానికి చెందిన డీలర్ బానోత్ రమేష్ తల్లి బానోత్ జీజా అనారోగ్యంతో బాధపడుతు ఇటీవలే మరణించగా వారి కుటుంబ సభ్యులను, పాలకుర్తి మాజీ శాసనసభ్యులు డా. ఎన్ సుధాకర్ రావు పరామర్శించి, ఆర్థిక సహాయం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ ముత్తినేని శ్రీనివాస్, తెరాస మండల పార్టీ ఉపాధ్యక్షులు, పి ఏ సి ఎస్ డైరెక్టర్ బానోత్ వెంకన్న,గ్రామ పార్టీ అధ్యక్షులు కూకట్ల వీరన్న, నాయకులు నునావత్ బాలు నాయక్, ఉపసర్పంచ్ కూకట్ల లక్ష్మి నారాయణ,పార్టీ కార్యదర్శి సారయ్య,నాయకులు మద్దెల శ్రీనివాస్, కూకట్ల శ్రీశైలం, భాస్కర్, కూకట్ల సతీష్, కూకట్ల లింగయ్య, కూకట్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 4:: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ధర్మ స్థాపనకు నిదర్శనంగా, విజయాలను అందించే విజయ దశమిగా దసరా పండుగను దేశవ్యాప్తంగా జరుపుకుంటారని సీఎం కేసీఆర్ అన్నారు. దసరా రోజున శుభసూచకంగా పాలపిట్టను దర్శించి పవిత్రమైన జమ్మిచెట్టుకు పూజలు చేసే సాంప్రదాయం గొప్పదన్నారు. జమ్మి ఆకును బంగారంలా భావించి పంచుకొంటూ, పెద్దల ఆశీర్వాదాలను అందుకుంటూ, అలయ్ బలయ్ తీసుకొంటూ ప్రేమాభిమానాలను చాటుకోవడం దసరా పండుగ ప్రత్యేకత అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

అనతికాలంలోనే అభివృద్ధిని సాధించి రాష్ట్రాన్ని ముందంజలో నిలిపిన తెలంగాణ పాలన, దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణ స్ఫూర్తితో దేశం ప్రగతిబాటలో నడువాలని సీఎం ఆకాంక్షించారు. విజయానికి సంకేతమైన దసరా నాడు తలపెట్టిన కార్యాలన్నీ ఫలించాలని సీఎం కేసీఆర్ ప్రార్థించారు. విజయ దశమి స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని దసరా సందర్భంగా సీఎం కేసీఆర్ కోరుకున్నారు.

సహజీవన సుమహారం

సంవత్సరం నిండా
ఎన్ని పండుగలున్నా
సబ్బండ వర్ణాల
సంబురమే బతుకమ్మ
సుద్దుల సద్దుల్ని మూటగట్టి
సాలు పొడుగూతా
సహజీవన సంకేతాన్నిచ్చే
సుమహారమే సద్దుల బతుకమ్మ!
ఆశ్వయుజం పర్వదిన మాసం
పుడమి తల్లికి తంగేడు
సూర్యుడద్దిన పసుపు పచ్చదనం
ప్రతి ఊరూ పరవశించే పూలవనం
వందలాది వలస పక్షులు
సొంత గూటికి చేరిన ఆనందం!
గునుగు పూవు గునిగినా
గుమ్మడి పూవు అలిగినా
కట్ల నీలిమలు కసురుకున్నా
తనతో అల్లుకుపోతూ
కలుపుకుంటూ పోయే తంగేడులా
ఔఅత్తామామల్ని గౌరవిస్తూ
ఆడపడుచుల్ని ఆధరిస్తూకొంటె
పిల్లల్ని బుజ్జగిస్తూ ఓర్పతో
ఇంటిని చక్కదిద్దే ప్రతి ఇల్లాలూ
ఓ సద్దుల బతుకమ్మే!
తొమ్మిదొద్దులు ఆడవారికి
ఆటవిడుపు సంబురమే
బతుకమ్మపూల సేకరణలో
కృష్ణజింకల్లాపుట్టల్లో గుట్టల్లో
పరుగెడుతూ
ఒకరింట్ల ఒకరు
గోపుర శిఖరాల్లాంటి
బతుకమ్మలను పేర్చే
కళా తపస్వీలవుతూ
ఎనిమిది రోజులుపాటల్లో మాటల్లో
ఎదలోనివెతలను పంచుకునే
ఏకైక పండుగిదే!
సద్దుల బతుకమ్మ నాడు
మగవారి నెత్తిమీద బతుకమ్మ
ఆడవారి చేతుల్లో
పసుపు కుంకుమల్లో గౌరమ్మ
పిల్లల చేతుల్లో సద్దుల మూటల్తో
నిమజ్జనం కోసం కదులుతుంటే
ఆ అనుబంధం ఒక ప్రబంధమే!
వేలపూల పరిమళం
వంద తాంబాలాల నిండుదనం
లక్షల పాటలకు కోట్లది గొంతులతో
పంతులు పాడే మహిళా వలయాలతో
బతుకమ్మ కుంటలు
రంగు రంగుల ఇంద్రధనుస్సులే!
చెరువులో బతుకమ్మ నిమజ్జనం
నిండు భక్తితో గౌరమ్మకు
వాయనం ఒకరికొకరు
సద్దుల పంపకం
ప్రభారాశుల వెలుగుల్లోబతుకమ్మలకు
వీడ్కోలు పలికిగౌరమ్మ ఆశీస్సులు
పొందినతియ్యటి
అనుభూతల్ని సిబ్బుల్లల్లో
మూటగట్టుకునితిరుగు ప్రయాణమే
ఒక సహజీవన సుమహారం!
అందుకే!
బతుకమ్మ అంటేనే
పానం పాలపిట్టయితది
మనసు గంగ పొంగయితది!

(శ్రీ శుభకృత్ నామ 03-09-22 సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు)ం

–డా॥ కూర్మాచలం,

– డా॥ కూర్మాచలం శంకరస్వామి
9703268858

నేను బ్రహ్మ కమలాన్ని

హరిత పత్రపు అంచుల్లోకి శక్తినంతా పొదువుకుని
నెలలు కాలాలు వేచి వేచి చూస్తూ ఉన్నాను..
ఇక వేళైందని మురిసిపోతూ మొగ్గ తొడిగాను
మెత్తని తెల్లని నా రేకులను విప్పుకోవాలని ఆరాటపడ్డాను..
పుప్పొడి రేణువులను తుమ్మెదలకివ్వాలని
తేనెటీగలకు మకరందాన్నివ్వాలనీ ఆత్రుత పడ్డాను..
నీటిలోని తెల్ల కలువతో పోటీపడుతూ
అంతకంటే అందంగా రేకులు విప్పుకుని
మీ ఇంటినే నందనవనంగా చేసాను..

నా ఆయువు ఒక్కరోజే అని తెలిసినా
నా కర్తవ్యాలన్నీ ఆనందంగా ముగించేసాను..

మనిషి జీవితం కూడా ఇంతే అంటూ
బతికినన్నాళ్ళు పదుగురికి మీ మేలు పంచమంటూ
పారమొకటి మీకు చెప్పి
వాడిపోతూ వడలిపోతూ
నేల తల్లి ఒడిలోకి చేరుకుంటున్నాను
మళ్ళీ నేల సారం పెంచి
మీకు సాయం చెయ్యాలని..

–రోహిణి వంజారి
సెల్: 9000594630

బాల ప్రతిభా పురస్కారాలు

విద్యార్థుల్లో భాషాసాహిత్యాలపట్ల అభిరుచి, ఆసక్తి కల్గించడానికిగాను, వారిలోని సృజనాత్మక రచనా నైపుణ్యాన్ని వెలికితీసి, రేపటి సాహితీ వారసత్వానికి పునాది వేయుటకుగాను, 2010 సం॥ నుండి 2019 వరకు **"బాల ప్రతిభా పురస్కారం"** పేర బడి పిల్లల రచనలకు ప్రోత్సాహకాలందించింది.

ఇందులో భాగంగానే రెండు తెలుగు రాష్ట్రాల్లోని 2020, 2021, 2022 సంవత్సరాలలో వెలువడిన బడి పి

సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com

website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 బుధవారం 5-10-2022

నానీలు

చెట్టూ గట్టూ
జ్ఞాపకాల మేడలు
ఎన్నటికీ చెరగవు
గతకాలం నీడలు.

మట్టి అమ్మాయితే
మనుగడ చెట్టు
మనిషి అక్షరమైతే
అది ఆవలి గట్టు.

కన్నీటిని అనువదిస్తే
సుఖాల కావ్యం
శ్రమలేఖిని విదిలిస్తే
బతుకు ధాన్యం!

నమ్మకం, ప్రేమ
ఆప్యాయతలకు
రూపం ఇచ్చి చూడు
అదే అమ్మ!

-డా॥ శిరీష
సెల్:98660 50220

గుంపురావం

తెరమరుగయ్యేది
అందం
తారలా మెరిసేది
బంధం.

నినాదాలను
నిరాదరిస్తే ఎలా?
ఆర్తనాదాలను
ఆహ్వానించినట్లే కదా

వైరుధ్యాలుండేవారకు
ఉద్యమం తప్పదు
సమతను సాధించేవరకు
సంఘర్షణ తప్పదు,

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

యశోదారెడ్డి చెప్పిన రహీం కథ

తెలంగాణ భాష యాసలకు నుడికారపు సొగసులను చేర్చి తెలంగాణా పలుకుబడులకు పట్టంగట్టిన కథా రచయిత్రి పాకాల యశోదారెడ్డి. సంస్కృతాంధ్ర భాషల్లో విదుషీమణిగా, పరిశోధకులూ, విమర్శకులుగా కవయిత్రిగా ఆమె సాహితీ ప్రస్థానం కొనసాగింది. మంచి వక్తగా మధురమైన కంఠంతో ఉపన్యాసాలిస్తూ సారస్వత సంగీతంలా జీవించారు యశోదారెడ్డి.

పల్లె పలుకుబళ్ళతో జాతీయాలు, సహజ వర్ణనలు, సామెతలు, పదబంధాలతో విలక్షణంగా ఉంటుంది ఆమె కథనశైలి. యశోదారెడ్డి కథా రచన 1950వ దశకంలో ఆరంభమై 1956 తర్వాత 1960, 70 దశకాల్లో ఎక్కువగా సాగింది. అయితే ఆమె 1990, 2000ల్లో కూడా కథా రచన చేస్తూనే ఉన్నారు. తెలంగాణ మాండలిక భాషా ప్రయోగంతో తెలంగాణా జీవన సంస్కృతులను చిత్రిస్తూ అచ్చమైన తెలంగాణ కథా రచయిత్రిగా ఆమె పేరు పొందారు.

యశోదారెడ్డి చాలా కథల్లో ఆమె చిన్ననాటి పల్లెల ప్రభావం, అక్కడి మనుషులూ, పేర్లూ, జీవన సంస్కృతి రూపంలో కనిపిస్తుంది. రచయిత మెదడులో చూసినవీ, తన అనుభవాలూ నిశిత దృష్టిలో నిక్షిప్తమై స్థిరపడి ఉంటాయి. గుప్తనిధిలా ఆ అనుభవాలు కథా రచనకు ఉపకరిస్తాయి. అదే యశోదారెడ్డి రచనల విషయంలో కూడా చూస్తాము.

'ధర్మశాల' కథా సంపుటిని 'సుధర్మ' ప్రచురణల ద్వారా 1999లో ముద్రించారు. అందులో 24 కథలు ఉన్నాయి. 'తియ్యటి తీగెలు' అనే కథ కథాంశం : ఉద్యోగం చేస్తూ ఇల్లాలిగా ఇంటి పనులు చక్కబెట్టుకుంటూ ఉండే అరుణ రచయిత్రి కూడా. ఒక రోజు ఆమె ముందుగా రేడియో స్టేషనుకు పోయి తన ప్రసంగం రికార్డు చేసుకొని ఆఫీసుకెళ్ళాల్సి వస్తుంది. ఆ రోజు వరీక్ష పెట్టినట్లుగా సహాయకారిగా ఉండే పనిమనిషి రాదు.

అరుణ తొందరగా పోవాలన్న ఒత్తిడిలో ఎంతకీ తరగని ఇంటి పనులు చేస్తూ చికాకుపడ్తుంటుంది. జ్వరం వచ్చి అది తారాస్థాయికి చేరుతున్నట్లుగా అనిపిస్తుంది ఆమెకు. "ఛీ పాడు చాకిరి, ఆడదై పుట్టేకన్నా అడవిలో చెట్టై, పుట్టలో మట్టై, తలుపుకు గొళ్లెమై పుడ్తూ బతకడం మేలు" అని తాను చేస్తున్న అదనపు చాకిరీ గురించి వాపోతుంటుంది.

ఆ రోజున రాని పనిమనిషిని 'మహారాజు' దానికేం అనుకొని తాను చాటువుకో సామ్యానికో అయినా సరే ! ఉపమాన రూపకాది అలంకారాలను ఆసరాగా తీసుకొని పుంలింగానికి పెద్దపీట వేసి, పురుషాధిక్యానికి చెరగని ముద్రవేస్తున్నానే అలవాటు ప్రకారం నా బానిసబుద్ధితో అనుకుంటూ మహారాజు అనే బదులుగా మహారాణి అనాలి కదా అని మళ్ళీ రాజో, రాణో ఏదైతే ఏమి నాకన్నా వందరేట్లు నయం నా పనిమనిషి అనుకుంటుంది.

మళ్ళీ ఆ పని భారం, పని ఒత్తిడిలో త్వర త్వరగా తిరిగిపోతున్న సమయాన్ని సూచిస్తున్న గడియారాన్ని పరిగెడుతున్న కాలాన్ని గూర్చి విపరీతంగా తిట్టుకుంటుంది.

తన ఆఫీస్‌లో కొత్త బాసు, లేతగా చిన్న పిల్లాడిలా మొదట కనిపించినా ఒక వారం రోజుల్లోనే ఉద్యోగులందరి ఆటలను ఆలోచనలను కనిపెట్టి కట్టుదిట్టంగా ఆఫీసు పనులు చేయించడాన్ని తలచుకుంటూ ఆమ్మో అవులిస్తే పేగులు లెక్కించే బాపతు అక్కడ ఏ సాకులూ వేషాలూ పనికిరావు అని భయపడుతుంటుంది.

ముందు రేడియో స్టేషనుకు వెళ్ళి రికార్డింగు పని గంటలో చేసుకొని ఆఫీసుకు పోవాలి అనుకొని పనులు ముగించుకొని బస్‌స్టాప్‌కు చేరుతుంది. ఎన్ని బస్సులు వచ్చిన తా దూరడానికి నందే దొరకదు. ఆటో కోసం ప్రయత్నిస్తే పది ఆటోలు ఆగకుండానే జారుకుంటాయి. అరుణలో టెన్షన్ పెరిగిపోతుండగా కాలయాపన జరుగుందని ఒక రిక్షా కనిపిస్తే రిక్షా ఎక్కేసి రేడియో స్టేషనుకు పోనివ్వమంటుంది. రిక్షా వాయువేగంగా ఆటో రిక్షాతో సమానంగా పోతున్నది. రేడియో స్టేషను సమీపిస్తుందనగా ఇరవై ఏళ్ళున్న రిక్షా పిల్లవాడు రిక్షాను ఒక సందులోకి మలుపుతాడు. దానికి పొద్దుటి నుండి చిరాకులో ఉన్న గృహిణి ఉద్యోగిని అయిన రచయిత్రి రిక్షా అబ్బాయితో తగువుకు దిగుతుంది. వారిద్దరి నడుమ ఎంతో సంభాషణ గొడవ గొడవగా తెలుగూ, ఉర్దూ భాషల కలయికలో జరిగిన తరవాత ఆ అబ్బాయి పేరు రహీం అనీ కాలం కర్మం గతితప్పడం వల్ల కుటుంబ పోషణ కోసం అతను ప్రైవేటుగా డిగ్రీ చదువుతూ రిక్షాలాగే పనిచేస్తున్నాడని తెలుస్తుంది.

ఇంతకీ రహీం తాను సీదాగా వెళ్ళాల్సిన రొడ్డును తప్పిస్తూ మరో సందులోకి రిక్షా మళ్ళించడం ఎందుకంటే ఆ సందులో తనకు కాబోయే భార్య సల్మా కుటుంబం ఉంటుంది. వాళ్ళెవ్వరు తారసపడినా తాను రిక్షా తొక్కుతూ కనిపించడం బాధకరంగా ఉంటుంది. రహీం అరుణల మధ్య అక్కా తమ్ముడి సామరస్యం ఏర్పడుతుంది. ఎంతో ఒత్తిడి చేసిన మీదట రహీం తను కొద్ది రోజుల క్రితం సల్మా ఉండే ఇంటి మూలమీద తన కోసం వేచి ఉన్న సల్మాను రిక్షా తొక్కుతూ కలుసుకున్నాని తమ ఇంటి పరిస్థితులు తల్లకిందులైనందున రెండేళ్లుగా వారి నిఖా వాయిదా పడిందనీ అప్పుడు సల్మా ఏమీ మాట్లాడకుండా ముఖం మీద ముసుగు తొలగించి నీళ్ళు నిండిన కళ్ళతో చూసి మూగవేదన అనుభవిస్తూ వెళ్ళిపోయిందనీ రహీం బాధతో మెలికలు తిరిగిన మనసుతో ఆ కలయికను తలచుకుంటూ రిక్షాలో కూర్చున్న రచయిత్రికి చెప్తాడు.

అక్కా ! బహెన్ ! అంటూ అరుణకు చాలా సున్నితంగా హృదయం ద్రవించేట్టుగా తాత్వికంగా చెప్తాడు. ఒక్కసారిగా రచయిత్రి మనోనేత్రాలు తెరుచుకుంటాయి. ఆమె రేడియో స్టేషనుకు సమయం సరిపోదని ఆఫీసుకే రిక్షామలవమంటుంది. రిక్షా దిగి వంద రూపాయలు రహీం చేతిలో పెడ్తుంది. ఆ రోజంతా ఆమె రహీం చెప్పిన విషాద కథను తలచుకుంటూ రకరకలుగా ఆలోచిస్తూ తాను పైపైన మనుషుల్నీ, జీవితాల్నీ చూసి కథలు రాస్తున్నాననీ, జీవనలోతుల్లో ఎన్నో కథలు యదార్థమైనవి ఉంటాయనీ అనుకుంటుంది. తను రచయిత్రి అయి కథలురాస్తూ గొప్పగా ఫీల్ అవుతున్నాను అనుకుంటుంది.

సాయంత్రం ఇంటికెళ్ళి కాఫీ తాగి తాను ముందు రోజు రాసిన కథను నిర్దాక్షిణ్యంగా చించేస్తుంది.

కొందరు పైకి మొరటుగా, కరకుగా కనిపించినా ఆ గుండెల్లో ఎన్నో అగ్ని పర్వతాలను మోస్తుంటారనీ వారి మనసు లోతుల్నీ, జీవన పార్శ్వాల్నీ దర్శిస్తే సౌకుమార్యపు సౌందర్యభావనలు సృజించవచ్చునని ఆలోచిస్తుండగా ఆమెను "తియ్యటి తీగెలు" అల్లుకున్నట్లు అనిపిస్తుంది. ఉదయం కనిపించి తన కకావికలమైన బతుకు కథ చెప్పిన రహీం కథను అల్లుతుంది రచయిత్రి. అదే యశోదారెడ్డి చెప్పిన "తియ్యటి తీగెలు" కథా కమీషు.

(7 అక్టోబర్, 2022 యశోదారెడ్డి 15వ స్మృతి రోజు)

-అనిశెట్టి రజిత,
సెల్:9849482462

తెలంగాణ అమరవీరులను స్మరిస్తూ ఆదివారం హైదరాబాద్ గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో మహిళలు, యువతులు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో అధికార భాషా సంఘం చైర్‌పర్సన్ మంత్రి శ్రీదేవి, తెలంగాణ సంగీత నాట్య అకాడమీ చైర్‌పర్సన్ దీపికారెడ్డి, టీఎన్జీవో మాజీ నాయకుడు దేవీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాధించిన మన రాష్ట్రం
మూడు పూలు,ఆరు కాయలు
ఆరుగాలం రైతు క్షేమం..
ఇంటింటా శుభోదయం..
అలుగులుబోసే చెరువులు,
నిలువెత్తున పంటచేలు..
మిషన్ కాకతీయ గాని,
మిషన్ భగీరథ గాని..
ప్రగతి పథంపై ముందుకు
పరుగిడుతున్నది రథం..
బాపు కేసీయార్ పేరు
మారు మోగుతోంది నిజం...
ఆనాటి అగచాట్లు పోయి
ఆనంద బాష్పాలు నేడు ..
మరువము మీ బలిదానం
మా ఆఖరి శ్వాస వరకు..
వెలుగుతున్న దీపాల్లో
వీక్షిస్తాం మిమ్ములను
ప్రతి పువ్వు మీరే అని
బతుకమ్మలు పేరుస్తం
అమర దీపాలైనా,
అఖండ జ్యోతులైనా
అన్నదమ్ములైన మిమ్ముల
నారాధిస్తం నిరంతరం..

(తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యం లో అమరులకు నివాళి) -మంత్రి శ్రీదేవి

పుస్తక సమీక్ష

వ్యక్తిత్వవికాసపు వెలుగులు చౌదూరి ఆణిముత్యాలు



కవిత్వం అన్ని సాహిత్య రూపాలకన్నా వేగవంతంగా మారే రూపంగా, కొత్త అనుభవాల్ని, అనుభూతుల్ని అందుకునే వారికి తేలిగ్గా అవగతమౌతుంది. కవిత్వం ఎప్పుడు ప్రాణవాయువై, స్పందనై, జీవమై, రుధిర సంచలనమై కవిని ఎప్పుడు నిలబెడుతుంది? అంటే **కవిరాసిన కవిత్వం పాఠకుడి జీవితంలో లేదా జీవన విధానంలో మార్పుకు ఎలా దోహదపడుతుందో ఎదురైన సమస్యలకు చక్కని పరిష్కార మార్గం చూపెట్టే ఆలోచన రేకెత్తిస్తుందో, అప్పుడు కవి జీవిత మార్గదర్శిగా భావించబడతాడు.** ఏది ఏమైన కవిత్వం పొద్దుపోక చదివి వదిలేసే అక్షర కూర్పు కారాదు. అణగారిన బతుకులకు ఆసరాని కల్పించే, సంకల్ప బలానిచ్చే చైతన్యస్రవంతి, అద్భుతాలను పలికించే విజ్ఞాన విపంచి.

కవిత్వం ఏ ప్రక్రియలో రాసినా దానికో లక్ష్యం వుండాలి. అది సామాజిక ప్రయోజనాసనని కాంక్షించేదిగా ఉండాలి. భవిష్యత్ జీవితానికి చక్కని మార్గాన్ని చూపెట్టేదిగా ఉండాలి. ఇటువంటి భావావేశంతో మనిషి మనీషిగా ఎదగడానికి దోహదపడే వ్యక్తిత్వ వికాసాన్ని వికసింపజేసే కవిత్వాన్ని చెప్పేందుకు కవి చౌదూరి నరసిం హారావు ముక్తకాలను "ఆణి ముత్యాలు" శీర్షికతో నాలుగు వందలుదాకా పుస్తక రూపంలో ముద్రించాడు. ఇవన్నీ క్షుప్తత గుప్తత పాటిస్తూ 'కొటేషన్స్' రూపంలో దర్శినమిస్తాయి. వీటిని చదివితే అవి వ్యక్తిత్వ వికాసాన్ని వికసింప చేయడానికి దోహదపడతా యనడం లో ఎట్టి సందేహమూ లేదు. "ఆణిముత్యాలు" చదివి తేలిగ్గా గుర్తుపెట్టుకునే విధంగా పొందికైన మాటలతో, ప్రాసనియమాలతో, లయాత్మకంగా వున్నాయి. ఆణిము త్యాలు ఒక్కొక్కటి నాలుగు వరుసల్లో ఎక్కువగా వున్నాయి.

చౌదూరి వారి ఆణిముత్యాలను కొన్నింటిని పరిశీలిద్దాం.

మనిషి ఎప్పుడూ మాటలవాడుగా వుండకూడదు. చేతలవాడిగా ఉంటేనే గొప్ప వానిగా గుర్తింపులోకి వస్తాడు. అనే భావనతో "వట్టిమాటలతో కోల్పోకు। నీలోని మంచితనాన్ని। గట్టి చేతలతో నిరూపించు। నీలోని గొప్పతనాన్ని" అంటారు. "వట్టిమాటలకంటే, గట్టి చేతలే మిన్న" అనే భావాన్ని వ్యక్తపరుస్తాడు కవి. మాటలకంటే చేతలు ముఖ్యం అనేది వ్యక్తిత్వ వికాసానికి మొదటి మెట్టు కదా!

"అంధకారాన్ని తొలగిస్తుంది । దీపం వెలుగు। అఖిల జగతికి జ్ఞానాన్నిస్తుంది। ఇల్లాలి చదువు"

ఇల్లాలి చదువు యింటికి వెలుగు అనే సామెత వుంది. దీపం ఏ విధంగా చీకటిని చీల్చివేస్తూ వెలుగును ప్రసాదిస్తుందో, అదేవిధం గా ఇల్లాలి చదువు ఇంటికే కాదు జగతికే వెలుగు అంటాడు కవి. ఇటు వంటి వాక్యం ప్రతివ్యక్తిలోనూ వికా సం కలిగిస్తుంది. ఆడపిల్లల్ని చదువుకు పంపుతారు. ఆడ, మగ సమాననంగా చదువులు కొనసాగిస్తే దేశవేసౌభాగ్యవంతంగా ఉంటుంది అనేది కవి భావన.

"అకారణంగానే । ఎదురయ్యే విమర్శలు। అనతి కాలంలోనే అవి। విజయానికి సోపానాలు" అంటారు.

కారణం లేని విమర్శవలన మనకు పోయేదేమీ లేదు. విమర్శలు వస్తున్నాయి, జాగ్రత్తపడాలి అనే హెచ్చరిక కలుగుతుంది. ఆ హెచ్చరిక మనసులో పడితే తప్పులు చేయడం మానుకొంటారు. పనిలో నిమగ్నమై పోతారు. విజయాన్ని కైవసం చేసుకుంటారు. శత్రువు చేసే విమర్శలు ఏవైనా మన విజయాననికి మెట్లుగా భావించాలి", అంటారు కవి.

మనిషికి ఎప్పుడూ "పాజిటివ్‌థింకింగ్' ఉండాలి. అంతేకాని ఈర్ష్య అసూయల వలన సమాజంలో శత్రువులను పెంచుకుంటామే గాని పననులు మాత్రం చక్కబడవు. అందరితో అభిమానంగా వుంటే అందర్నీ అభిమానిస్తూంటే అందరూ మిత్రులవుతారు. అందరి సహకారం అందుతుంది. అనుకున్న పనులు శీఘ్రగతిలో నెరవేరుతాయి.

"అసూయపడే వారికి। అగుగడుగునా శత్రువులే। అభిమానించేవారికి। అందరూ మిత్రులే "

"వీలైనంత వరకు ప్రతి మనిషి శత్రుత్వాన్ని తగ్గించుకోవాలి. మిత్రత్వాన్ని పెంచుకోవాలి" అనేది కవి భావన.

గురు, శిష్యుల బంధాన్ని ఎంత గొప్పగా చెప్పాడో కవి గమనించండి! గురవు సూత్రధారి। శిష్యుడు పాత్రధారి" అంటారు. గురువు సూత్రీకరిస్తూ ఒక సమస్యను అధిగమించే మార్గం వివరిస్తాడు. శిష్యుడు రంగంలోకి దిగి గురువుగారు చెప్పిన సూత్రాన్ని నిజజీవితంలో అమలు చేస్తాడు. చెప్పేవాడు గురువు. చేసేవాడు శిష్యుడు. గురువు అనుభవసారాన్ని సూత్రంగా రూపొందించి శిష్యునికి బోధిస్తాడు. శిష్యుడు ఆ మెలుకువలు తెలుసుకొని కార్యనిర్వహణ కొనసాగిస్తాడు.

ప్రతి జీవి స్వతంత్రం కోసం పోరాడుతుంది. బంధీగా ఉండడానికి ఇష్టపడడు. పంజరంలో వుండి పాలు త్రాగేకంటే స్వేచ్ఛగా బయట ఉండి నీళ్లు త్రాగడం మేలు అంటాడు. ఆ భావనతోనే ఈ ఆణిముత్యం.

"స్వతంత్రం । స్వర్గం
పరతంత్రం । నరకం"

అంటారు.

"చచ్చినవాడినే । కాల్చుతుంది చితి
చచ్చేదాకా। కాల్చుకుతింటుంది చింత"

చితి మంటకంటే చింతనాజ్వాల తీవ్రమయినది అంటాడు కవి.

చచ్చిన శవాన్ని చితి కాలుస్తుంది. కాని చింత అంటే విచారం, దుఃఖం, మాత్రం మనిషిని జీవచ్ఛవాన్ని చేసి చచ్చేదాకా కాల్చుకుతింటుంది. కనుక దుఃఖం అనేది చితిమంటలకంటే ప్రమాదమైంది అంటాడు కవి.

"వినడానికి। తొందరపడు
మాట్లాడడానికి । తొందరపడకు" అంటాడు కవి.

వినదగు ఎవరు చెప్పిన అనే సూక్తిలో ఎవరు ఏమి మాట్లాడుతున్నా వినవచ్చును. అంతేకాని తొందరపడి ఎవరితోనూ మాట తూలరాదు. ఆచితూచి మాట్లాడాలి. ఆనందంగా ఎవరు చెప్పినా వినాలి. ఈ సూత్రం తెలిసిన వ్యక్తి సమాజంలో శాంతికాముకునిగా పేరుతెచ్చుకుంటాడు.

కవి చౌదూరి దాదాపు నాలుగు వందలకు పైగా ఆణిముత్యాలు రాశారు. పుస్తకంగా ప్రచురించారు.

ఈ గ్రంథం ముఖ్యంగా తల్లిదండ్రులు చదువదగినది. సూక్ష్మమైన ధర్మాలు ఇందులో చౌదూరి వారు తేలికైన భాషలో, అర్థమయ్యే రీతిలో చెప్పారు. ప్రతి ఒక్కరు వీటిని పఠించి తెలుసుకున్నట్లయితే ఇంట్లో పిల్లలకు చెప్పి గుర్తుపెట్టుకునేట్లు చేయగలిగితే వారు భవిష్యత్‌లో వారి వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకోడాననికి ఈ సూక్తులు సహాయపడతాయి. చౌదూరి నరసింహారావు గారు సంస్కృత ఆంధ్రంలో గొప్ప పండితుడు. వారి పరిశీలనా అనుభవంలో నుంచి జాలువారిన ఆణిముత్యాలు పాఠకుల్ని అలరిస్తాయని భావిస్తూ కవిని అభినందిస్తున్నాను.

ప్రతులకు:
చౌదూరి నరసింహారావు,
వెల.రూ.100/-
9705100788,

-కొండెడ్డి వెంకటేశ్వరెడ్డి
9948774243

సమ్మేళనంలో ప్రసంగిస్తున్న దాస్యం సేనాధిపతి

డా॥ చక్రపాణి "కలశం" కవితా సంపుటిని దాస్యం సేనాధిపతి, రాయవరపు సరస్వతి, 'ఆశల పల్లకి' కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న ఎర్రం రాజారెడ్డి. వేదికపై సావిత్రి రంజోల్కర్, స్నేహలత, ఉషశ్రీ, ఝాన్సీరెడ్డి, అంజయ్య, లక్ష్మయ్య, ప్రేమదాస, చక్రపాణి వైరాగ్యం ప్రభాకర్, సరోజా రెడ్డి , అనుశ్రీ, స్వప్న

సమ్మేళనంలో ప్రసంగిస్తున్న కాసర లక్ష్మి సరోజారెడ్డి.

ఆనందోత్సాహాల మధ్య నేటికవిత ఆత్మీయ సమ్మేళనం

శ్రీ దాస్యం లక్ష్మయ్య గారి అధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా వాట్సాప్ వేదికగా నిర్వహించబడుతున్న నేటికవిత ఆత్మీయ సమ్మేళనం అక్టోబర్ రెండో తేదీ ఆదివారం ఆనందోత్సాహాల మధ్య గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించ బడింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుండి హాజరైన ప్రతినిధులతో కళాశాల ప్రాంగణమంతా కళకళలాడింది. పండుగ వాతావరణాన్ని తలపించింది. ఆత్మీయ పలకరింపులు, స్నేహ సంబంధ పరిమళాలను పంచుతూ మాట్లాడుకునే సన్నివేశాలు, యోగక్షేమ సమాచారాలు, పరస్పర పరిచయాలు,సన్నివేశాలను వరవాణిలో భద్రపరిచే దృశ్యాలు.. అందరికీ ఓ గొప్ప అనుభూతిని పంచాయి. సమూహ సలహాదారులు, ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు శ్రీ దాస్యం సేనాధిపతి గారి మార్గదర్శనం, ఏర్పాట్లలో కెప్టెన్ రేళ్ల సంజీవ్ గారి పర్యవేక్షణ, అడ్మిన్ శ్రీదాస్యం లక్ష్మయ్యగారు, వారి సతీమణి శ్రీమతి గోదాదేవి గారు వారి వియ్యంకులు శ్రీ నల్లవెల్లి శ్రీనివాస్, కుమారుడు హరీష్, కోడలు భావన మరియు మనుమడు త్రిలోక్ మోక్షిత్ మొత్తం కుటుంబ సభ్యులు సమ్మేళన ఏర్పాట్లలో లీనమై అందరికీ ఆదర్శంగా నిలిచారు. ప్రారంభ కార్యక్రమానికి శ్రీమతి గౌరోజు అనుశ్రీ, దార స్నేహలత, స్వాగతం పలికారు.

ఉదయం వది గంటలకు నేటికవిత అడ్మిన్ శ్రీ దాస్యం లక్ష్మయ్య గారి అధ్యక్షతన జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీదాస్యం సేనాధిపతి గారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కవన క్షేత్రాన నేటికవిత వాట్సాప్ సమూహంలో వచనకవిత్వంతో పాటు కథలు, గేయాలు, గజల్ వంటి ప్రక్రియలలో సమూహ సభ్యులను ప్రోత్సహించడంలో లక్ష్మయ్య గారు చూపుతున్న చొరవ ప్రశంసనీయమని అన్నారు. సమూహంలోని సభ్యులు ఇలా కలుసుకొని ఒకరి ఆలోచనలను మరొకరు పంచుకోవడానికి ఆనందాలను గొప్ప అనుభూతులను మూటగట్టుకొని వెళ్లడానికి ఓ మంచి అవకాశమని పేర్కొన్నారు. సభాధ్యక్షులు లక్ష్మయ్య గారు మాట్లాడుతూ నేటికవితకు తమ రచనల ద్వారా సహకారం అందిస్తున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలోనే మరిన్ని వైవిధ్యభరితమైన కార్యక్రమాలతో వినూత్నంగా తీర్చిదిద్దగలమని అన్నారు.

ప్రారంభ సభలో విశిష్ట అతిథులుగా సీనియర్ సాహి తీవేత్తలు డాక్టర్ చక్రపాణి యిమ్మిడి శెట్టి, శ్రీ కొమురవెల్లి అంజయ్య, శ్రీ కాసర లక్ష్మి సరోజారెడ్డి, డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్, ఆత్మీయ అతిథు లుగా కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ ఎర్రం రాజారెడ్డి, శ్రీమతి సావిత్రి రంజోల్కర్, శ్రీమతి ఝాన్సీ రెడ్డి, శ్రీమతి కాసనగొట్టు స్వప్న, తదితరులు పాల్గొన్నారు. శ్రీ ప్రేమ్‌దాస్ రంజోల్కర్ గారు జ్యోతి ప్రజ్వలనం చేసి సభను ప్రారంభించారు.

సమ్మేళనంలో పాల్గొన్న ప్రతినిధులు

సీనియర్ సాహితీవేత్త డాక్టర్ చక్రపాణి యిమ్మిడిశెట్టి రచించిన కలశం వచన కవితాసంపుటిని శ్రీ దాస్యం సేనాధిపతి గారు, రాయవరపు సరస్వతి గారు రచించిన ఆశలపల్లకి కథల సంపుటిని శ్రీ ఎర్రం రాజారెడ్డి గారు ఆవిష్కరించారు. అనంతరం ఐదు ఆవృతాలలో స్వీయ పరిచయ సభలు నిర్వహించారు. ఈ అయిదు ఆవృతాలకు అధ్యక్షులుగా డా. చీదెళ్ల సీతాలక్ష్మి, శ్రీమతి పత్తిపాటి రూపలత, డా. సుధాకర్ శ్రీమతి వకుళవాసు, శ్రీమతి రమాదేవి కులకర్ణి గారలు వ్యవహరించగా సభల సమన్వయకర్తలుగా శ్రీమతి ఆది విజయలక్ష్మి శ్రీనివాస్, శ్రీమతి విజయలక్ష్మి నాగరాజ్, శ్రీ వెల్ముల జయపాల్‌రెడ్డి, వకుళాభరణం శివ రంజని, శ్రీమతి ముత్యపు భాగ్యలక్ష్మి గారలు సమన్వయం చేశారు. భోజన విరామం అనంతరం సన్మానాలు.. సత్కారాలు.. అవార్డుల ప్రదానకార్యక్రమం అడ్మిన్ గారి అధ్యక్షతన జరిగింది. శ్రీమతి వెగ్గలం ఉషశ్రీ గారు సమన్వయకర్తగా వ్యవహరించారు.

ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీదాస్యం లక్ష్మయ్య, శ్రీ దాస్యం సేనాధిపతి, శ్రీమతి కాసర లక్ష్మీసరో జారెడ్డి, డా. వైరాగ్యం ప్రభాకర్ , శ్రీమతి చీందం సునీత, శ్రీమతి లక్ష్మీపద్మజ, శ్రీమతి బుక్కపట్నం రమాదేవి, శ్రీమతి రమాదేవి కులకర్ణి గారలు అవార్డు గ్రహీతలకు కవితా భూషణ, కవితావిభూషణ, సహస్ర కవితా స్ఫూర్తి అవార్డులను సభ్యులకు అందజేశారు. ఇదేకార్యక్రమంలో శ్రీమతి సావిత్రి రంజోల్కర్ గారు తమ శ్రీవారితో కలిసి తాము రచించిన కాలం మాట్లాడుతుంది గ్రం థాన్ని శ్రీ దాస్యం సేనాధిపతి గారికి అంకితమిచ్చారు. అలాగే డా. చక్ర పాణి గారి కలశం గ్రంథ రూపకల్ప నలో సహకరించిన దాస్యం సోదరు లకు, వైరాగ్యం ప్రభాకర్ గారలను సత్కరించారు. శ్రీమతి కాసనగొట్టు స్వప్న నేతృత్వంలో నేటికవిత సమూహ సభ్యులు ఇదివరకే వెలువరించిన వున్నకాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను కెప్టెన్ రేళ్ల సంజీవ్ ప్రారంభించారు.

విశిష్ట కవి గుర్రం జాషువా

"కులం - మతం అనే సంకుచిత భావాలు పాముల్లా బుసగొట్టుతున్న కాలమది. అంటరాని తనం కరకరలా డుతున్న పాడుకాలమది.

వినుకొండ వీధిలో ఒక బాలుడు నడుస్తున్నాడు. అగ్రవర్ణానికి చెందిన మరో బాలుడు ఆ వీధిన పోతూ, 'నన్ను తాకకు దూరంగా పో' అని ఈసడించు కున్నాడు. ఆ అవమానాన్ని భరించలేక ఆ బాలుడు తన ఆవేదనను తల్లి ముందు తోడు కున్నాడు. తల్లి బాలుని కన్నీటిని తుడ చింది. తన కళ్లల్లో నీళ్లుబుకుతున్నా తమాయించుకొంది. అంటరాని వారిగా పరిగణింపబడిన ఆ బాలుడే పెరిగి పెద్దవాడై నవయుగ కవిచక్రవర్తి అని కీర్తింపబడినాడు. అతడే కవికోకిల గుర్రం జాషువా"

కవిత్వంలో కూడా కులబేధాలా? గౌరవం

కులానికా? కలానికా? అని ఆశ్చర్యపోయే రోజుల్లో గుర్రం జాషువా పుట్టారు. ఆయన పద్యాలు చదివి మెచ్చుకున్న వారే, కులం తెలుసుకున్నాక చీదరించుకున్నారు. చీకొట్టారు, నొచ్చుకున్నారు . గుర్రం జాషువా కవిత్వాన్ని, అతని వ్యక్తిత్వం నుండి విడదీసి చూడలేము .

1895 సెప్టెంబర్ 28న వినుకొండలో గుర్రం వీరయ్య బిలింగమాంబలకు జన్మించారు. జాషువా గారు కవి కావడానికి అనుకూల పరిస్థితులు లేని, వ్యవస్థను ఎదుర్కొని నిలబడి మహాకవిగా పేరు పొందాడు. కులం రీత్యా నాటకం చూడడా నికి వీలు లేదు .కులం వల్ల స్కూల్లో వేదిక ఎక్కి పద్యాలు చదివే అవకాశం లేదు. అయినా అన్ని గాలి వానలకి సహించి తన కులం వారి చేత మాటలు పడ్డారు. మాల మాదిగల పట్ల భేద భావాన్నిసహించ లేకపో యారు. ఉపాధ్యాయుడుగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. ఆనాటి మూకి చిత్రాలకు వ్యాఖ్యాతగా ఊరులో తిరిగిన ప్పుడు కందుకూరి చిలకమర్తి ప్రోత్సాహాన్ని పొందాడు. భాషా ప్రవీణులై తెలుగు పండితుడై బురదలో పుట్టినా కమలం లా వికసించారు.

ఆకాశవాణి మద్రాస్ కేంద్రంలో తెలుగు ప్రొడ్యూసర్గా పని చేశాడు. కవికోకిల, కవితా విశారద, మధుర శ్రీనాథ, నవయుగ చక్రవర్తి మొదలైన బిరుదులు పొందారు. కళా ప్రపూర్ణ పద్మభూషణతో సత్కరించబడ్డారు. "క్రీస్తు చరిత్ర" కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

గబ్బిలం, పిరదౌసి ముం తాజ్ మహల్, నాగార్జునసాగర్, స్వప్న కథ, లాంటి "ఖండ కావ్యాలు", శివాజీ ప్రబంధం కన్యకా పరమేశ్వరి లాంటి "పద్య కావ్యాలు "రాశారు. "నా కథ" పేరు మీదుగా, "పద్య రచన స్వీయ చరిత్రగా'' రాశాడు. సాహిత్య రంగంలో తొలితరం కవుల్లో అన్ని విధాల కానవచ్చే మహనీయమూర్తి గుర్రం జాషువా నిజంగా సుకవే. ప్రజల హృదయాలలో కూడా సజీవంగా ఉన్నాడు అసలైన కీర్తిశేషుడు జాషువా

"రాజు మరణించే నొక తార రాలిపోయే
సుకవి మరణించేనొక తార గగనమెక్కె
రాజు జీవించే రాతి విగ్రహములందు
సుకవి జీవించే ప్రజల నాలుకల యందు"

జాషువా సంప్రదాయ బద్ధమైన పద్యాన్ని ఆయుధంగా ఎంచుకున్న, పద్యరచనలో మార్పు తెచ్చాడు. వ్యాకరణ నియమాలు నడలించి భాష స్వేచ్ఛను వ్యక్తీకరించాడు. పంచమకు ఎక్కడుందని ప్రశ్నించారు. జాషువా విగ్రహారాధన పట్ల సుముఖుడు కాదు, పేదవాళ్లను కాదని ఉన్నవాళ్ళకి పెట్టడం ఏమిటన్నది ఆయన ఆధునిక హేతువాద దృక్పథం.

జాషువా గారిది ప్రతిఘటన తప్ప, కసి ద్వేషం కాదని గుర్తించాల్సిన అవసరం ఉంది. కరుణ రసంలో నుంచి వీర రసాన్ని పొంగించిన కవి. ఆయన చిందించే కన్నీళ్లు అగ్ని గోళాలు. ఆయన ఏ విషయం మీద వర్ణించిన దృష్టి మొత్తం అమానుషం మీద అసమ సమాజం మీదే ఉంటుంది. ఎవ్వరు చూడని చీకటి కోణాల్ని చూడగల క్రాంతదర్శి గుర్రం జాషువా.

అన్నార్తుల ఆక్రందనని ధ్వనింపజేసే ముందు చూపు, లోచూపు ఉన్న కవి జాషువా. స్మశానవాటికలో ప్రతిపద్యం తీవ్రమైన అనుభూతిని కలుగజేసి ,చచ్చిన తర్వాత అయినా అందరూ ఒకటే అనే తత్వాన్ని బోధిస్తాడు. "తెలివికి కలిమిలేము లతో నిమిత్తం లేదని "ప్రతిభను కులమతాల తక్కెడలో తూచరాదని విశ్వసించి, తన జీవిత మంతా ఆవిశ్వాసాన్ని, కవిత్వం గా విశ్వసించిన గొప్ప కవి జాషువా గారు.

తన కవిత్వంలో ఏమేమి ఉండవో చెప్పాడు. గతానుగతికంగా చెప్పబడే లక్షణాలు లేవన్నాడు. వాటి కోసం వెతకవద్దన్నారు. ఏమీ లేవో తెలుసుకుంటే ఏమున్నాయోనని చూసే చూపు వక్రత లేకుండా సూటిగా ఉంటుందన్నారు. తెలుగు సాహిత్యానికి గొప్ప సేవలు చేసిన విశిష్ట కవి గుర్రం జాషువా గారు 1971 జులై 24న కీర్తిశేషులు అయ్యారు.

(సెప్టెంబర్ 28, జాషువా జయంతి సందర్భంగా)



-యాడవరం చంద్రకాంత్ గౌడ్
9441762105

నవయుగ కవిచక్రవర్తికి నమస్సులు..

అవమానాలు ఎదుర్కొంటూ
అవరోధాలు దాటుకుంటూ
అందమైన ఖండకావ్యాలు
అందరికీ అందించి
అందని శిఖరమెక్కినా
ఆధునిక సాహితీ సేద్యకారి..!
అతడే మన నవయుగ కవిచక్రవర్తి..!!

అంటరాని కులమున పుట్టినా
అవహేళనలు యెన్నో చేసినా
పట్టుదలతో పాండిత్యం పొంది
చీత్కరించిన వాళ్ళతోటే
సత్కారాలు చెయించుకున్న
సంస్కృత పండితుడు..!
సమూల మార్పులకు ఆద్యుడు..!!

దళితుల గోడును
గబ్బిలం ద్వారా తెలిపిన
గండపెండేరుడతడు
సమాజ శ్రేయస్సును కోరి
కులరక్కసిని ఎండగట్టిన
కవికోకిల బిరుదాంకితుడతడు..!
నేటి కవులకు స్ఫూర్తిదాతయతడు..!!

భావకవిత్వం ఉచ్ఛస్థితినున్నపుడు
సామాజిక రచనలు చేస్తూ
సమాజానికి పట్టిన మకిలిని
సమూలంగా కడిగివేస్తూ
సాగిన సాహితీవేత్త యతడు..!
సమానత్వం కోసము
సాహితీసమరం సాగించిన
మానవతావాది కదా అతడు..!!

అతడే అతడే
నవయుగ కవిచక్రవర్తి
సాధించెనెంతో గొప్ప కీర్తి
అదే మాకు కొంతైనా ప్రాప్తి..!
అయ్యాడు నేడందరికి స్ఫూర్తి..!!

-పసుల.శంకర్
9542181301

కవిత్వనావ! గుర్రం జాషువా!

జీవన యానంలో తొలిదశలో ఎదురైన బండరాళ్లు
ఆ "సంకల్ప శరీర"కి మలిదశలో సన్మానాల దండలుగా
కంఠసీమను అలంకరించాయి.
న్యూనతల బురదలో పదే పదే జారిపడినా ఆ"సంస్కరణ జీవి"కి
బిరుదులా రాజసింహాసనాలు ఆహ్వానం పలికాయి
దేశభక్తి, మానవతావాదాల చక్రవర్తాల సమ్మిశ్రీతాలు
వస్తు వైవిధ్య స్వర్ణఖండాలు, ఆయన కావ్యాలు, ఖండకావ్యాలు
అసమానతల, దురాచారాల అనలబిలాలపై వారుణాస్త్రం
దళితచైతన్య ప్రేరకం, జాషువా స్వీయ చరిత్ర ప్రతీకాత్మకం
ఆగామి యుగాలు సైతం కీర్తించే
అమరశ్రవ్య కావ్యం "గబ్బిలం"!
మృత్యువుకు పక్షపాతం లేదంటూ,
భోగశీల, నియంతృత్వశక్తులకు
హెచ్చరిక వేదిక, "శ్మశానవాటిక" కావ్యరాజు!
కరుణరసవారాశి, దానవతపై శాంతిఅసి, "పిరదౌసి!"
అమృతమయ ప్రణయ,
ఉదాత్త దాంపత్య, వైరాగ్య సందేశ
భావ శిల్పాల తేజోమహల్,
"ముంతాజ్ మహల్"!
సామ్యవాద సామాగ్రినిండిన నౌకలు,
"అనాథ", "కాందిశీకుడు" కృతులు!
కుల, మతాల ఇనుపగూళ్లలోంచి
ఎగిరిపోయి, లౌకికవాద
గీతికలను గ్రహాంతరాలలో వినిపించిన
"కవికోకిల"!
అసాధ్యమనుకుంటే,
క్రీస్తు చరిత్రను తెలుగు నుడికారానికి
అనుగుణంగా రచించి
"కేంద్రసాహిత్య అకాడమీ" పురస్కారాన్ని
అందుకున్న, "నవయుగ కవిచక్రవర్తి"!
ఆయనే! చీకటి సముద్రంలో దిక్కుతోచని
బహిష్కృత జీవుల్ని
బ్రతుకాశల తీరాన్ని చేర్చిన
కవిత్వనావ! "గురం జాషువా!"

- వి.ఎస్.వి.ప్రసాద్
సెల్: 8106320576

డబ్బుతో కొలిచే కాలం

నాన్న ! నేను చెప్పలేదా
ఎంత మంది అపరిచితులతో ఇంటర్వ్యూలో
ఏ పరీక్షల్లో లేని క్వశ్చన్స్ ఈ పరీక్షలో ఉంటాయని
ఇది ఓ గొప్ప భార్యామణి ఉద్యోగం
సబ్జక్ట్ చాల క్రిటికలే
అయినా తప్పదు ఆ పోస్టుకోసం ప్రిపరేషన్
దానికి కావల్సిన మెటీరియల్ మనవాళ్ళు
అందిస్తూనేవున్నారు
ముత్యంల ముద్దస్తున్నావని అమ్మమ్మ
రత్నంల వున్నావని అమ్మ
ఈ గాజులైతే బాగుంటాయని చిన్నత్త
జీన్స్ లో ఐతే బాగుంటావని పట్నం పెద్దమ్మ
కాస్ట్యూమ్స్ - మేకప్ - డైలాగ్స్
ఇది రోజు నాకో రిహార్సల్ క్లాసు.

ఎన్ని హంగులు ఎన్ని ఆర్భాటాలో
తేరగా వచ్చింది మెక్కుతు హైటూ వేటు క్లాసంటూ
ఆకరగా ఒక చిన్న క్వశ్చన్ అని
పెద్ద ఎస్సేటైపు క్వశ్చన్ గుండెలపై వేసి వెళ్తారు
ఆ తర్వాత క్లైమాక్స్ నెక్స్ట్ రొటీన్

ఎందుకు నాన్న ఈ తతంగాలు
గాలికెగిరే పతంగీలలా
ఆడదానికి అగ్ని పరీక్షే కదా!
సాంప్రదాయ ముసుగుతొడిగి
మణుల విస్తరి పరిచిన పోటిపడే కాకులెన్నో కదా!

ఎందుకీ వివాహవ్యవస్థ భ్రష్టుపడుతుంది
వేదమంత్రాలు వెక్కిరింతలవుచున్నవి
ఆడదాన్ని త్రాసులో పెట్టి కొలిచే కాలం కరిగిపోదా
కొలతలు లెక్కలతో వెగటుగా చూస్తుంటే
నా గుండె ఎంత ఘోషించింది
ఈ సమాజంలో నాలాగే ప్రతీ ఆడపిల్ల
చీత్కారాలకు సత్కారాలకు మధ్య చితికిపోతున్నారు

నాన్న! ఇక్కడ నా అంతరంగం ఎవరికి అర్థం కావట్లేదు
ఇక్కడ మనుషులందరివి రాతి గుండెలు
అవి స్పందించాలంటే ఇంజక్షన్ లువేయాలి
ఆ మందు తయారుచేసే మహానుభావులు
ఎక్కడ పుడతారో
పైనున్న నీవు ప్రపంచాన్ని చూసి
నాకు చెప్పవా!!

- వజ్జీరు ప్రదీప్
998956299

స్వేచ్ఛ నే ఆనందం..!!

స్వేచ్ఛ లేకుంటే బంగారు పల్లెం భోజనం రుచించదు
జైలు కూడు లా కనిపించింది మనిషికి
ప్రతి ప్రాణి స్వేచ్ఛ ప్రాణవాయువు తో సమానం
అది కరువైన నాడు స్వర్గము కూడా నరకమే..

రత్నాలు పొదిగిన పంజరమైన పక్షికి కష్టమే కదా
రెండు రెక్కలు ఆడిస్తూ నింగిలో తిరగడమే ఇష్టం
కట్టేసి పెట్టిన గింజలు తిన్నా తృప్తి ఉండదు
స్వేచ్ఛగా తిరుగుతూ తినడంలోనే సంతోషం..

గొలుసులతో బంధించి ఆహారం పెట్టినా
కడుపు నిండినా మనసు తృప్తి కలుగదు
అడవిలో ఉంటూ తిన్నా నిజమైనా ఆనందం
కలుగుతో కలిసి జీవించిన నాడే జీవిత సాఫల్యం..
ప్రతి మనసు స్వేచ్ఛగా తిరిగితేనే ఆనందం
అది కొరబడితే పుడుతుంది తిరుగుబాటు
ఆనందం లేని అమృతం ఎంత తాగిన ఫలమేమి
బంధిస్తే చిన్న ప్రాణి ఆత్మాభిమానం అమానం దెబ్బతినే..

సృష్టిలో ప్రతి జీవికి స్వేచ్ఛ కోసం తపించే
సృష్టి ప్రాణిగా జీవించడానికి గుర్తింపు కలిగించే
స్వేచ్ఛలేని బ్రతుకులు కారాగారపు లోయలు
కబంధహస్తాల జీవితం నిత్యం వేదనలు.

బానిసత్వపు బ్రతుకులు ఎదారిలా తయారయ్యే
ఆశల గడ్డి మొలకలు పుట్టక మనసు వేదనయ్యే
స్వేచ్ఛ లాంటి ఒయాసిస్ ఒక్కటి ఉంటే చాలు
మనసంతా పచ్చబడి స్వేచ్ఛ గానమే పాడుకునే..

-కొప్పుల ప్రసాద్
9885066235

గురు బోధనం

వేకువ దారిని జూపగ
చీకటి పరదాలు చీల్చి చెలిమిని గూర్చున్
తేకువ బ్రతుకుకు నేర్పుచు
రేకులు విచ్చిన సుమముగ రేపిక మార్చున్.

గురువే యద్భుతమౌచును
తరువుగమారినక్షణమునదక్కునుఫలముల్
పరముగ నిలుచుచు సతతము
పరమును శిష్యాళికిడుచు పరమాత్ముండౌ

చదువుల సారము పెంచుచు
మృదువుగ బోధన సలుపుచు మేధావులుగన్
పదవుల విలువను జెప్పుచు
కదనముగెలువగనడుపును కారుణ్యముతో

ప్రత్యక్ష బోధన తోడను
నిత్యము జెప్పిన చదువుకు నిఖలములోనన్
పత్యము లేదని నుడవగ
ముత్యముతీరుగమెరియుచుముదమునుగూర్చున్
సారము నిచ్చెడి విద్యను
ధారణ జేసెడి విధంబు తపసుగ జెప్పున్
ప్రేరణగ నిల్చి పోవుచు
వేరుగ మనతో జతపడు వేత్తగ గురుడున్
మూర్తిగ ముందుకు నడుపును
నార్తిగ జెప్పును సకలము నందరికెపుడున్
పూర్తిగ విద్యను నేర్పుచు
స్ఫూర్తిని నింపును మనకును

-డా॥ సముద్రాల శ్రీదేవి
9949837743

సమర శంఖం

రైతుల వెతలు
తీరన్నంత కాలం
కలం కరవాలంగానే
మారుతూ ఉంటుంది.

కార్మికుల కష్టాలు
వీడనంత కాలం
అక్షరం ఫిరంగిగా
గర్జిస్తూనే ఉంటుంది.

ఆడ బిడ్డల రోదనలు
ఆగనంత కాలం
కవిత్వం ఎర్ర జెండాగా
విప్లవిస్తూనే ఉంటుంది

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

ఎవరికోసమో గస్తీ

అక్షరాలు నేర్చిననోరు
పుస్తకాలు మోసిన వీపు
ప్రతిజ్ఞ చేసిన చేతులు
జ్ఞానాన్ని పొందిన మెదడు
ఎందుకో వెనకబడుతుంది
ఎవరెవరికోసమో
కొమ్ముకాస్తుంది
ఎవరి ఉనికి కోసమో
పాకులాడుతుంది
చిన్నచిన్న ఆశలకు లొంగి
చదువు నేర్పిన జ్ఞానాన్ని
వ్యక్తిత్వాన్ని తాకట్టు పెట్టి
అంగడిలో అమ్మకాని పోయిన
గొర్రె, బర్రెలాగ బేరమౌతుంది
తన సామర్థ్యాన్ని మరచి
ప్రశ్నించే తత్త్వాన్ని విడిచి
ఎందుకో స్వార్థపూరితంగా
తన బొంద కోసమే
బందీఐన బానిసోలే
సహజత్వాన్ని కోల్పోయి
కృత్రిమ ప్రవర్తనతో
చిత్రైతున్న విశయాన్ని గ్రహించలేక
ఎవరికోసమో గస్తీ కాస్తుంది.

-పోలీస్ భీమేశ్
9505255218

కొత్త సైకిల్ (కథ)

అనగనగా ఒక ఊరిలో రమేష్ అనే బాలుడు ఉండే వాడు. వారిది పేద కుటుంబం. రమేష్ వాళ్ళ ఊరిలో ఉన్నత పాఠశాల లేకపోవడం వలన ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పక్క ఊరికి రోజు నడుచుకుంటూ వెళ్ళేవాడు. తరగతిలో తానే బాగా చదివేవాడు. రోజు అంత దూరం నడిచి వెళ్లడం అతడికి చాలా కష్టంగా ఉండేది. వాళ్ళ నాన్నను ఒక సైకిల్ కొనివ్వవమని రమేష్ అడిగాడు. మనకు తినడానికే తిండి దొరుకుతలేదు. ఇంకా నీకు సైకిల్ ఎలా కొనివ్వను అని బాధపడుతాడు.

ఒకరోజు రమేష్ బడికి వెళ్తుండగా కళ్ళు తిరిగి అడ్డం పడిపోతాడు. అతనికి దెబ్బలు బాగా తగిలాయి. ఎవరో తెలిసిన వారు రమేష్ ను వాళ్ల ఇంటి వద్దకు చేర్చుతారు. ఆతర్వాత రమేష్ అంత దూరం నడిచి వెళ్లలేక బడికి పోవడం మానేస్తాడు.

కొన్ని రోజుల తర్వాత రమేష్ రావడం లేదని వాళ్ళ తరగతి ఉపాధ్యాయుడు అతని ఇంటికి వెళ్తాడు. ఉపాధ్యాయుడికి రమేష్ వాళ్ళ తండ్రి జరిగిన విషయం చెప్తాడు. రోజు రాను పోను పది కిలోమీటర్లు నడవడం వలన రమేష్ అలసిపోతున్నాడు. అందుకే ఇగ రమేష్ ను బడికి పంపం అంటారు.

ఉపాధ్యాయుడు వారి ఇబ్బందిని గ్రహించి ఎలాగైనా రమేశ్ ను పాఠశాలకు రప్పించాలనుకున్నాడు. మరుసటి రోజు రమేష్ పుట్టిన రోజు. ఆరోజు ఉదయమే వాళ్ల ఇంటి ముందు ఒక కొత్త సైకిల్ ఉంది. రమేష్ ఆశ్చర్యపోయాడు. రమేష్ తో పాటు చదువుకునే హరీష్ ఆ సైకిల్ ను తీసుకు వచ్చాడు. ఇది ఎక్కడిది అని అడుగుతాడు రమేష్. సార్ నిన్న మీ ఇంటికి వచ్చినపుడు మీ ఇంటి పరిస్థితులను చూసి నీకు ఏదైనా సహాయం చేయాలనుకుని ఈ కొత్త సైకిల్ నాతో పంపించాడు అని చెపుతాడు హరీష్. రమేష్ సంతోషంతో ఆ సైకిల్ పై బడికి వచ్చి సార్ కు కృతజ్ఞతలు చెపుతాడు. అప్పటి నుండి రమేష్ బడికి క్రమం తప్పకుండా వచ్చి మంచి పేరు తెచ్చుకున్నాడు.

-యం. శివనాగేశ్వరి,
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. నర్సింహుల పల్లి.
పెద్దపల్లి జిల్లా.

సహాయం (కథ)

రామాపురం అనే గ్రామంలో రవి అనే బాలుడు ఉండేవాడు. వారిది చాలా పేద కుటుంబం. రవి చిన్నతంలోనే తన తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారాడు. ఎవరైనా పెడితే తినడం లేకపోతే లేదు. కరోనా సమయంలో లాక్ డౌన్ వలన అతనికి తిండి దొరకని పరిస్థితి ఏర్పడింది.

అప్పటికే ఆతనికి తిండి లేక రెండు రోజులు అయ్యింది. పూర్తిగా నీరసంతో ఉన్నాడు. ఎవరైనా తిండి పెడుతారేమోనని రోడ్డువెంట బయలేదేరాడు. కానీ కరోనా వలన ఎవరు దగ్గరకు రానీయలేదు. తినడానికి కూడా ఎవరు ఏమి పెట్టలేదు.

అలా నడుచుకుంటూ వెళ్తూ ఒక ఇంటి ముందు కులబడుతాడు. ఆ ఇంట్లో ఉన్న లక్ష్మి అనే బాలిక నీరసంగా తమ ఇంటిగేటు ముందు ఉన్న రవిని చూస్తుంది. లక్ష్మి తల్లిదండ్రులు వద్దంటున్న వినకుండా ఆ బాలిక రవి వద్దకు వచ్చి నీకు ఏమైంది అని అడుగుతుంది. చాలా ఆకలిగా ఉంది అంటాడు రవి. వెంటనే లక్ష్మి ఇంట్లో నుండి భోజనం, నీళ్లు తెచ్చి రవికి ఇస్తుంది. రవి భోజనం చేసి ఈ రోజు మీరు నాకు ఈ ఆహారం పెట్టకపోతే నేను ఆకలితో చనిపోయేవాడిని. మీకు చాలా ధన్యవాదాలు అని చెప్పి వెళ్తాడు.

కొన్ని రోజుల తర్వాత కరోనా తగ్గిన తర్వాత పాఠశాలలు ప్రారంభం అయ్యాయి. లక్ష్మి బడికి వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు తనను ఒక ఆటో ఢీకొడుతుంది. లక్ష్మికి బాగా దెబ్బలు తగులుతాయి. అప్పుడు అక్కడే ఉన్న రవి వెంటనే 108 కి ఒకరి ఫోన్ తో ఫోన్ చేస్తాడు. దగ్గరలో ఉన్న ఒక హాస్పిటల్కి లక్ష్మిని తీసుకువెళ్తాడు. కొద్దీ సేపయ్యక లక్ష్మి తల్లిదండ్రులు హాస్పిటల్కు వస్తారు. మీ కూతురును వెంటనే హాస్పిటల్కు తీసుకు రావడం వలన బతికిందమని డాక్టర్లు చెపుతారు. అందుకు కారణం రవి అని లక్ష్మి తల్లిదండ్రులు తెలుసుకుంటారు.

ఒకప్పుడు తనకు భోజనం పెడితే వద్దన్నామని గుర్తుకు వచ్చి లక్ష్మి తల్లిదండ్రులు సిగ్గుపడుతారు. తమ పాప చేసిన సాయమే దేవుడే రవి రూపంలో వచ్చి కాపాడారని వారు అనుకున్నారు. అప్పటినుండి వారు కూడా ఎవరైనా ఏదైనా అవసరానికి వారి ఇంటికి వస్తే సహాయం చేయడం మొదలు పెట్టారు. లక్ష్మితో పాటు రవిని కూడా మంచి బడిలో వేసి వారిని చదివించారు.

అందుకే ఎవరికైనా మనము ఏదైనా సహాయం చేస్తే ఊరికే పోదు. మళ్లీ మనకు తిరిగి ఎదో రూపంలో అందుతుంది.

-బి. లక్ష్మి గణేష్, 9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. నర్సింహుల పల్లి
పెద్దపల్లి జిల్లా.

సర్వకోణ దిక్సూచి

పుస్తక సమీక్ష

మనిషి తృప్తిగా జీవించడానికి మానవత్వం, ప్రేమ తత్వం, ఆధ్యాత్మిత లాంటి టానిక్‌లు ఎంతో అవసరమని కవి శ్రీ పిల్లి హజరతయ్య గారు తన జీవితానుభవాల సారాన్ని రంగరించి కలబోసిన కమ్మని కవితల సారాంశమే " వెలుగు దివ్వెలు " అనే కవితా సంపుటి.

అతి పిన్న వయస్సులోనే జీవిత కష్టనష్టాలను, ఒడిదుడుకులను చవిచూసిన ఆత్మాభిమానం, పరోపకారం, మంచి స్నేహ స్వభావి అయిన కవి హజరతయ్య . తాను పడిన కష్టాలు ఇతరులకు రాకూడదనే సత్సంకల్పం కలిగిన మానవీయుడు. తల్లిదండ్రులు, గురువులనే కాదు. డాక్టర్ లు, సైనికులు, రైతుల లాంటి మన సేవకులను కూడా ఆసరాగా ఉండాలంటాడు తన కవిత్వంలో... మచ్చుకు కొన్ని చూద్దాం....

"సాగే తన శ్వాస"...అనే తన కవితలో...ఒక చోట....

ప్రకృతి అన్నదాతతో ఆడుకున్నా
సర్కారోళ్ళు ఎరువులు ఇవ్వకున్నా
దళారీలు పంటను దగా చేసినా
వడ్డీ వడ్డీ వడ్డీ వని విక్రమార్కునిలా
పంటలు పండిస్తునే ఉంటడు.... అంటారు. వచన కవిత్వంలో కవికి స్వేచ్ఛ బాగా ఉంటుంది. అందుకే ఈ కవితల్లో కవి హజరతయ్య గారు... తన భావావేశాలన్నిటినీ... స్వేచ్ఛగా... తెలుపగలిగారు. నేటి కాలంలో బంధుత్వాలు దూరమౌతున్నాయన్న ఆవేదనతో.. తన "ఆత్మీయ పలకరింపు" అనే కవితలో..... " ఎవరికి వారే యమునా తీరే,

అన్నట్లు ఉండే బంధువులు
చేరువైనా ఫలితం గుండు సున్నేగా!" అంటున్నాడు. నిజమే.. నేటి కాలంలో ఏ శుభకార్యం జరిగినా... వచ్చామా! తిన్నామా! వెళ్ళామా!..అన్నట్టే తప్ప బంధువుల మధ్య ఆప్యాయత, ప్రేమానురాగాలు శూన్యమని కవి భావం కావచ్చు. అందుకు ఉదాహరణ ఈ కవిత.

" నిద్ర లేచింది మొదలు
ఉరుకులు పరుగులు
నశించిపోతున్న బంధాలు
మాయమవుతున్న మానవత్వాలు

" అంటూ.. నేడున్న ప్రజల పరిస్థితిని తూర్పారబట్టాడు తన 'మానవత్వం మోడుబారితే ' అనే కవితలో...

'దురాశ దు:ఖానికి చేట"న్నట్లు... అత్యాశలకు పోకుండా సహజమైనా ఆశాజీవులుగా ఉంటేనే, జీవితం సంతృప్తికరమంటూ....

" వికసించే పుష్పం నేర్పుతుంది
తనలా అందంగా జీవించమని
రాలిపోయే ఆకు చెబుతుంది

జీవితం శాశ్వతం కాదని " అంటూ.. ప్రేమతత్వం అనే కవితలో సాయిబాబా తత్వాన్ని చెప్పడంలో కవిలోని ఆధ్యాత్మిక చింతన, మంచితనం, మానవత్వాలకు ప్రతీక.

" చట్టాలు ఎన్నున్నా , అవి పటిష్టంగా అమలు జరుగవు" అంటూ సంధించిన తన కవితలో కవి విమర్శనా కోణం కనబడుతుంది. కవిలో ఉండాల్సిన ఒక మంచి లక్షణం ఇది.

" కన్నీరు ఇంకిపోతుంది" అన్న కవితలో కవిలోని దేశభక్తి ఎంత ఉందో? చదివితే అర్థమవుతుంది. మరోచోట " కాకలు తీరిన ఉద్ధండులు " అంటూ.. చెప్పిన కవితలో....ఓటుకు నోటు తీసుకుంటే.. మేకవన్నె పులులు జీవితాలను కాళరాస్తా యిరా... అంటూ ఓటర్లను హెచ్చరిస్తారు. ఇందులో ఒక పౌరుని బాధ్యత... కనబడుతుంది.

నేటి కాలంలో వివిధ కారణాల వలన పాడైపోతున్న పర్యావరణ వ్యవస్థ గూర్చి.. " నేల తల్లి నెర్రెలిస్తే...." కవితలో సవివరమైన కారణాలను చక్కగా వివరించారు. ఇవన్నీ పాటించి

"భవిష్యత్ తరాలకు నీరును ఆదా చేసి,

మానవ జాతి వినాశనాన్ని ఆపాలి" అనడంలో .... కవి భావి తరం గురించి కూడా పడుతున్న తపన, ముందు చూపును మెచ్చుకోకుండా ఉండలేము.

ఇలాంటి కవితలు కూడా ఎన్నో పాఠకుల రోమాలను నిక్కపొడుచుకునేలా చేసేవి ఈ గ్రంథంలో ఉన్నాయి. ఈ కవిలో బాధ్యతతో పాటు ఆవేశం, ఆదర్శం, ఆవేదన, దేశభక్తి, ఆధ్యాత్మికత అన్నీ ఉన్నాయి.

నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుందని.... పెద్దలకు, పిల్లలకు అందరకూ తన ఆవేదనను, ఆవేశాన్ని, అనుభవాలన్ని జోడిరచి రచించిన 100 కవితలు ఇందులో చాలా ఉన్నాయి. అందులో కవిలోని అనేక రకాల కోణాలను మనం చూడగలుగుతాము. ఒక సుభాష్ చంద్రబోస్, ఒక సాయిబాబా, ఒక రాముడు, ఒక శ్రీశ్రీ, ఇలా తన కవితలను చదువుతున్న పాఠకులకు అనేక మంది మహానుభావులు గోచరిస్తారు.

ఎన్నో విలువలతో కూడిన, ఎన్నో కోణాలలో భావాలు , కర్తవ్యాలు, బోధనలతో నిండి వున్న "సర్వకోణ దిక్సూచి" లాంటి ఈ పుస్తకం ప్రతి ఒక్కరూ చదువదగినదే..

ప్రతులకు: "పిల్లి హజరతయ్య, డోర్ నెం. 7'128/ఏ, హనుమాన్ నగర్,సింగరాయకొండ, ప్రకాశం జిల్లా, పిన్.523101
వెల: రూ.150/-

-మద్దిరాల శ్రీనివాసులు
ఫోన్ :9010619066

నిన్ను నన్ను కలిపింది

ఒక ప్రేమ సంతకం
మమతల వల వేసింది నీ మనసు వసంతం.

మంచినీహారంగా ధరించు నీవు
మమతల సౌందర్యాన్ని పెనవేసుకున్న
ఆలోచన చేయి

ఎక్కడో డబ్బుకు దాసోహం అంటావు
మనసు పరిమళం పోగొట్టుకుంటావు

జీవితాన్ని
అయోమయ సాగరంలో ముంచుతావు

చౌరస్తా కూడలిలో
నీ జీవితాన్ని దాసోహం అనే ఇస్తావు

చీకటి గర్భంలోకి సాగిపోతావు
క్షణిక ఆనందం కోసం జీవన విలువల్ని
తాకట్టు పెడతావు

నీ అస్తిత్వాన్ని చివరికి కోల్పోతావు
నిన్ను ఆరాధించే
ఆత్మీయతను తుంగలో తొక్కి

జీవితానికి బదిలే లేని మనుషుల మధ్య
చివరికి నీవు మట్టిలో కలిసేవు

మనిషిగా రూపురేఖల కన్నా
కామదాహాల కన్నా
ఎవరికో సర్వం ధారపోస్తావు

వాడు చివరకు నిన్ను ద్రోహం చేస్తాడు
దారి తప్పిన మనిషిగా చేసి
పిచ్చిదానిగా మార్చేను

అప్పుడు జీవితంలో
పశ్చాతాపం కలిగేను
జీవితం ఏమిటి ఎందుకు ఇలా జరిగిందని
వేసుకుని ప్రశ్నలు
ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పలేని
కాలమంతా కరిగిపోతుంది
చివరికి నిర్జీవమైపోయి నిశ్శబ్ద లోకంలో
ఆ రూపిగా మారేవు

-డాక్టర్ సిహెచ్ ఆంజనేయులు,
7702537453

మన దేశం !!

ఆచంద్రార్కం వెలిగేదే
మన సంస్కృతి..!!
ఆసేతుహిమాచలమంతా
కలిసిన భారతి..!!

ప్రపంచశాంతి సౌభ్రాతృత్వం
ప్రతిపాదించే మనదేశం..
సర్వజనావళి సుఖసౌఖ్యాలను
ఆకాంక్షించే మనదేశం..

పురాణాలతో ప్రబంధాలతో
విరాజిల్లు మనదేశం..
వశిష్ఠవ్యాసాది మహాఋషులతో
విలసిల్లే మనదేశం..

అందరు మెచ్చి అవలంబించే
ఆదర్శాలే మనవి..
అంతేలేని సుందరప్రకృతి
అందాలెన్నో మనవి..

భిన్నజాతులకు మత భాషలకు
ఆలవాలమే మనదేశం..
కన్నతల్లిని జన్మభూమిని
ఆరాధించుట మన భాష్యం !!

-పేరిశెట్టి బాబు
9247170800

నానీల శతకం

-హెచ్.ఆర్.చంద్రం
9493248053

అమ్మ నాన్న
ప్రత్యక్ష దైవాలు
వారి తరువాతే
మరెవ్వరైనా.

చేతి చమురు
ఎంత వదిలినా
సన్మానం
సంతృప్తికరం కదా

జనం వచ్చింది
కూలికైతే నేం
రాజకీయ సభ
విజయవంత మైనట్టే

అన్నింటా తనకన్న
ఆమే హెచ్చు
ఐనా కట్నం కక్కుర్తి
వదలడు వరుడు

మనుషులకే కాదు
దేవుళ్లకీ
లంచం ఎరవేస్తాడు
స్వార్థపరుడు.

రుద్దితే రాయి
అరిగిపోతుంది
సానబెడితే రత్నం
మెరుగు లీనుతుంది

నేత్రం
బాహ్యదర్శనం చేయిస్తే
జ్ఞాననేత్రం
అంతరార్థాన్ని పట్టి యిస్తుంది

రూపాయి విలువ
తరిగిపోయిందా
వస్తువుల అవసరం
పెరిగిపోయిందా.

వేదాంతం
తిని కూర్చోమనలేదు
స్వధర్మం
నిర్వహించమనే చెప్పింది.

భక్తుడి ధ్యాస
వరాల పైన
పూజారి దృష్టి
దక్షిణ పైన

క్షణం చాలు
చావటానికి
బతకటానికో
జీవితకాలం చాలదు.

దారి చూపాల్సింది
మృత్యు తీరానికి కాదు
ప్రాణి కోరేది
సుఖ జీవనమే.

వెల చెల్లిస్తే
పుస్తకం నీదౌతుంది
చదివితేనే
సారం ఒంటబడుతుంది

విత్తనాలన్నీ
మొలకెత్తవు
వ్యక్తు లందరూ
వ్యుత్పన్నులు కాలేరు.

రైతు చెమట చుక్కలు
చిలకరిస్తేనే
పుడమితల్లి
పులకరిస్తుంది

కృత త్రేతా ద్వాపరాలు
కలి యుగమూ
స్త్రీజాతిని
వంచిస్తూనే వుంది

పగ లందరూ
పెద్దమనుషులే
చీకట్లోనే
నిజాలు బయట పడతాయి

చేతిలో
సెల్ ఫోన్ లేకపోతే
చిన్నపిల్లలకీ
చెప్పలేని నామోషి.

పుస్తకం హస్తభూషణం
అది గతం
సెల్ ఫోన్ చేతి తొడవు
ఇది ప్రస్తుతం.

కాంక్రీటు వనాలు
సెల్ టవర్లు
ఊర పిచ్చుకల
ఉనికే ప్రశ్నార్థకం

నోటు గాలానికి
ఓటు చేప చిక్కింది
ప్రజాస్వామ్యం
పరిహాసపాత్ర మైంది.

మహాత్ముల శిరస్సు చుట్టూ
తేజోవలయం
జ్ఞాననేత్రానికే
దర్శనార్హత

ఇంటి బాధ్యత
పనిమనుషులది
సమాజోద్ధరణ
మహిళామణిది

శ్రీమతి పెట్టింది
చుక్కల ముగ్గు
నింగి నేలకు
దిగివచ్చినట్టైంది

కరెంటు కోత
ఉక్కపోత
తాటాకు విసనకర్రతో
తాతకు ఊరట

కాలువలు
ఎండిపోతున్నాయి
సముద్రాలు
నిండి పొంగిపోతున్నాయి
కేలండర్ ప్రతిదినం
హెచ్చరిస్తుంది
రోజులు లెక్కిస్తూ
బతకమని

తేదీయారం గుండెచప్పుడు
గుర్తు చేస్తూనే వుంటుంది
కాలం
విలువైన దని

దినపత్రిక
తెరవాలంటే భయం
చేతులు
రక్తసిక్త మౌతాయని

డబ్బుంటే పదవి
డబ్బుంటే కీర్తి
ఓటుంటేనే
పేదలకి కించిత్తు గుర్తింపు

ఎన్ని వింత లుంటేనేం
నింగిలో
నన్ను భరిస్తోన్న
నేలంటేనే నాకిష్టం

కనిపించని
దేవుడు నా కేల
జన్మదాతలే నాకు
ప్రత్యక్ష దైవాలు

జెండాలు మోసేది
కార్యకర్తలు
కుర్చీలెక్కేది మాత్రం
నేతాశ్రీలే

అచ్చులో
తొలి రచన
కవిగారి వదనం
పూర్ణచంద్రబింబం.

పలితకేశం(పండువెంట్రుక)
ప్రమాద సూచిక కాదా
కౌంట్ డౌన్
మొదలైనట్టే యింక

'సర్' కి 'అయ్యా'
'మేడమ్' కి 'అమ్మా'
పర్యాయపదాలు
కాలికపోతున్నాయి.

చెక్కిళ్లపై
నఖక్షతాలు (గోరు నొక్కులు)
శృంగార చిహ్నాలా
పోరాట సాక్ష్యాలా

బతకటానికి
తిండి ముఖ్యం
మిగతావన్నీ
దాని తర్వాతే

పోస్టుమేన్ల
బరువు తగ్గింది
సెల్లుఫోన్ల
ఆదాయం పెరిగింది

నదుల నడక
సాగరం వైపే
నాయకుల చూపు
పదవుల పైకే

నేత లందరూ
ఉత్తములే
ఉత్తుత్తి మాటలలో
అత్యంత నేర్పరులు.

గూడు కట్టుకోవటం
కోకిలకే కాదు
కొందరు మనుషులకీ
చేతకాదు.

సైనికుడు చేసేది
సమరం
సామాన్యుడు చేస్తున్నది
జీవనపోరాటం

మట్టి మర్మం
అన్నదాత కెరుక
పదవి గుట్టు
రాజకీయ నేత కెరుక.

విశ్వాసం
కుక్కల జాతి లక్షణం
మునుషుల్లో అది
కొందరికే పరిమితం

పంటపొలాలు
చేపల చెరువు లౌతున్నాయి
అన్నదాత
వ్యాపారి అయ్యాడా

అన్నదాత
కంట తడి పెడితే
దేశం
సుభిక్షంగా వుంటుందా

రాత్రికిరాత్రే
పార్టీ ఫిరాయింపు
పదవి ముఖ్యం
పరువు కాదు

రెక్కలు
లేకపోతేనేం
గగన విహారానికి
ఊహలు చాలవా

ఉచిత విద్యకు
ఆదరణ తక్కువ
ఖరీదు విద్యకే
గౌరవం ఎక్కువ.

ఉండీ తిండి మానితే
ఉపవాసం
లేక కడుపు మాడితే
పస్తు

బాల్ పెన్ దెబ్బకు
సిరాబుడ్డి ఫట్
పాపం ఇప్పు డది
మ్యూజియంలో వస్తువే ఐంది.

కన్ను చూడగలిగేది
స్వల్పం
మనస్సు గ్రహించేది
అనంతం

కోపం
కట్టలు తెంచుకొంటోంది
వ్యక్తుల మీద కాదు
వ్యవస్థ మీద.

పువ్వులంటే ఇష్టం
పిల్లలంటే ఇష్టం
పువ్వుల్ని పిల్లల్ని
పెంచటమే కష్టం

వీడు మగాడంట
ఒక ఆడపిల్ల
సొమ్మిచ్చి కొంటేనే
మొగు డౌతా డంట

పగ లైనా
రేయి యైనా
పండు వెన్నెలే
పాపాయి బోసినవ్వు

సంకల్పం
మంచిదైతే సరిపోదు
దాన్ని సాధించే
సామర్థ్యం కూడా కావాలి

కాగితాలపై కాదు
పాఠకుల
హృదయాలలో ముద్రించాలి
కవిత్వం

వృద్ధుల సంఖ్య
పెరుగుతోంది
వృద్ధాశ్రమాల సంఖ్యా
వృద్ధిచెందుతోంది

తెల్లకాగితమే
నాకు ప్రేరణ
చూస్తే చాలు
భావా లుప్పొంగుతాయి

అచ్చు ముచ్చటేస్తోంది
అక్షర దోషాలే
కంటిలో నలుసుల్లా
బాధిస్తున్నాయి

సైకిల్
సామాన్యుడి వాహనం
ఇప్పట్లో దాని వేగానికి
బ్రేకులు పడవ్

పాత సినిమా
కళాఖండమే
అభిరుచీ ఓపికా
ప్రేక్షకుల కుండాలి

పేదవాడైతే నేం
మంచి పుస్తకాలు
సంపాదించి
సరస్వతీపుత్రు డయ్యాడు

పట్టుచీర
కట్టినంత మాత్రాన
వర్షీయసి
పెళ్లికూతు రవుతుందా

హిందీ జాతీయ భాష
ఆంగ్లం అనుసంధాన భాష
తెలుగో
వెలుగు భాష

తోకలేని పిట్ట
అడ్రస్ గల్లంతైంది
సెల్ఫోన్ దెబ్బ
పిట్టలమీదే పడింది

లేక పస్తు
ఉండీ ఉపవాసం
పస్తుకు దక్కుతుందా
ఉపవాస ఫలం

దేవు డున్నా డంటాడు
కాని చూపలేడు
పాపం ఆస్తికుడు
ఎప్పుడూ డిఫెన్సే

ప్రచారం కోసం
పాడు పనులే చెయ్యాలా
ఉడత సాయం
చరితార్థం కాలేదూ

అన్నీ వదిలిన
సన్నాసి నంటూ
బతకటానికేమో
బిచ్చ మెత్తుకుంటాడు

పంట దిగుబడి
సంతృప్తి నిచ్చినా
మద్దతు ధర
సంతాపాన్నే మిగిల్చింది

బళ్లకొద్దీ
వేదాంత గ్రంథాలు చదివినా
ఒక్క ముక్కా
బుర్ర కెక్కలేదంట

మా పెరట్లో
మామిడి చెట్టుంది
ఆమనీ కోకిలా
క్రమం తప్పక వస్తాయి

మీ యింటిలో
టీవీ లేదా
ఆశ్చర్యం
ఇది నమ్మదగ్గ మాటలా లేదే

ఆ పద్దమనిషి
ఏదీ సూటిగా చెప్పడు
పూర్వాశ్రమంలో
'రాజకీయ' దట

మనం
వ్యావహారికాన్నే రాద్దాం
కాని గ్రాంథికాన్ని
గౌరవిద్దాం

వచనానికి
వ్యావహారికం చాలు
పద్య రచనకు
గ్రాంథికాంధ్రం మేలు.

ఆచార్య దేవో భవ
ఇది ఉపనిషత్తు
మార్గదర్శకులకు
వందనాలు

మన దేశం
పురోగమిస్తున్నట్టే
ఓటు రేటు
దురూహ్యంగా పెరుగుతోంది

పద్య వాంగ్మయం
వారసత్వ సంపద
వదులుకుంటామా
పదిలపర్చుకుందాం.

పెద్దల సుద్దులు
ఆలించు గ్రహించు
అనుభవాల సారం
మార్గదర్శకం.

దేవాలయాలూ
మైలపడిపోతున్నాయి
రాజకీయ దుర్గంధం
సర్వాంతర్యామి

శ్రమజీవికి
పని కల్పిస్తే
ఎన్నో కరువులు
మటుమాయమైపోతాయి

భక్తి యెంత వున్నా
భుక్తి గడవదు
కృషికే
పట్టాభిషేకం

నీ విధ్యుక్త ధర్మం
నిర్వహించు
కాదంటావా
ఒక్క సారి 'గీత' చదువు

స్వరాజ్యం
నీ జన్మహక్కే
శ్రమైకజీవనం
మానవ బాధ్యత

దానం చేసింది
పది శాతమే
ప్రచార ఆర్భాటం
తొంబై శాతం.

షేర్ ఆటోల
జోరు పెరిగింది
పాపం రిక్షాలు
పక్కకు తప్పుకుంటున్నాయి

అతను కాలు జారి
నేలబడ్డాడు
ఆమె కాలు జారి
పరువు కోల్పోయింది

పాపం పట్టణ వాసులు
పచ్చిక బయళ్లూ
పచ్చని పొలాలూ
ఎరుగుదురా

వైద్యుడు
దైవస్వరూపుడే
వృత్తి ధర్మం
మరచిపోనంత వరకు

పూలు ముడిచిన
కొప్పు చూస్తే
కరుణశ్రీ పుష్పవిలాపమే
గుర్తొస్తుంది.

జాతస్య హి ధ్రువో మృత్యుః
ఇది సత్యం
కొంచెం ముందూ వెనకా
అంతే తేడా

రామాయణంలో
వానర స్త్రీలకి
తోక లుండ వేల
వాల్మీకి మర్చిపోయడా

చేతిలో
సెల్ ఫోన్ లేదా
అంత అనాగరికమా
ఎంత అప్రతిష్ఠ

తెలుగు పద్యం
అర్థం కావటం లేదా
ప్రయత్నిస్తే
ఫలితం తప్పక వుంటుంది

నా కవిత్వం
తళుక్కుమనే మెరుపు కాదు
హాయిగొలిపే
వెన్నెల

ఆచార్య ఎన్ గోపి
నానీల నాన్నగారు
ఈ కవితా ప్రక్రియ
చిరంజీవి.



సెల్: 9440622781

పిల్లలు మానేశారు
నిక్కర్లు
పెద్దలు తొడుక్కుని
కొడుతున్నారు చక్కర్లు!

కొత్త వైరస్ ఆట!
ఊరంతా జబ్బు చేసింది
డాక్టర్లకు
డబ్బు చేసింది!

కన్న ప్రేమ
కనుల వాలే కల
కమనీయ దృశ్యం
ఎవరి భాగ్యం వారిదే!

మురళీధరీయం..ముచ్చటైన ఉత్తరీయం

పుస్తక సమీక్ష

గ్రంథమంతా అచ్చమైన సరళమైన తెలుగు భాషకు పట్టం కట్టిందనే భావనతో ముచ్చటైన ఉత్తరీయం అని సంబోధించాను.

వచన,పద్య కవితలే కాకుండా ఎన్నో వైవిధ్యమైన రచనల తో తెలంగాణ రాష్ట్రంలో మాంచెస్టర్ అఫ్ ఇండియా గా పేరొందిన రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో... వాసి కెక్కిన గొప్ప రచయిత శ్రీ రాకుమార గారు.

సెలయేరు, వెలుగు రేఖలు, ముత్యాల సరము నల్ల బంగారం, విద్య, ఊపిరి పాట , అక్షరం ,తెలుగు వెలుగు , లోకం పోకడ మొదలైన ఎన్నో ఉన్నత సాహిత్య సౌరభాలైన వైవిధ్యమైన గ్రంథాలను వెలువరించిన శ్రీ రాకుమార గారు.

సకల జనుల శ్రేయోభిలాషి సద్గుణ సంపన్నుడు గౌతమీనగర్ అభయాంజనేయ స్వామి దేవాలయ పూజారి బ్రహ్మశ్రీ రాంపెల్లి మురళీధర శర్మగారి, ప్రభోద ప్రవచనాలను ఆటవెలది పద్య రూపం కల్పి స్తూ అష్టోత్తర శత పద్యాలను మురళీధరీయం పేరుతో అమూల్యమైన గొప్ప గ్రంథాన్ని వెలువరించారు.

ఒకప్పుడు కవిత్వమంటే అంతా ఛందోబద్ధమైన పద్యమ యమే.

పౌరాణికాలకు మరియు రాజవంశీయులకు సంబదించిన విషయాలపై మాత్రమే కవులు రచించే వారు ఛందోబద్ధమైన కవిత్వం రాయడం అంటే కవులకు ఎప్పుడైనా కత్తి మీద సాములాంటిదే. అనన్యమైన భాషాభావాలతో గణాలకు అనుకూలమైన అక్షర పద సంపదలతో యతి ప్రాసల ప్రయాసలతో అలంకార సంధి సమాసాల రసభరి తాల సమ్మేళనం గుణాత్మ కమైన కవిత్వాన్ని అందించాల్సి ఉంటుంది అయినను అది అందరికి చేరువవుతుందో లేదోనని బెంగే అయినప్పటికీ గొప్ప ప్రయత్నం చేశారు కవివర్యులు శ్రీ రాకు మారా గారు.

మనమంతా నిత్య జీవితంలో పాటించవలసిన సూక్ష్మ మోక్షాలను సుమధుర భావనలు నిండిన సామాజిక ఇతివృత్తాల తో ఆధ్యాత్మికతలు జోడించిన శ్రీ శర్మగారి నిత్య ప్రవచనాలకు ... శ్రీ రాకుమార గారు అనన్యమైన కృషితో ,అలతి అలతి పదాలతో సరళతలకు పెద్ద పీట వేస్తూ ...సర్వ జనావళికి చేరువయ్యే విధంగా మనకందించడంలో సఫలీకృతుల య్యారు ..

నేటికి రెండొందల పైచిలుకు పద్యాలైనప్పటికి అష్టోత్తర శతకంగా 108 పద్యాల సంఖ్యను ఎన్నుకుని గ్రంథాన్ని తీసుకొని రావడం వెనుక కూడా ఆధ్యాత్మిక చింతననే గోచరిస్తుంది.

మనిషి జీవనమే జగన్నాటకం లో ఒక పెద్ద పాత్ర మనసున్న మనిషి వైవిధ్యభరితమే జీవరాశిలో మిన్నగా చేసి చూపింది. సృష్టిలో వేరుగా చేసి చూపింది. ఆధిక్యతలను కట్టబెట్టింది అనితర సాధకుడిగా గుర్తించింది. మనిషి జీవన విధానం బంధనాలతో బంధుత్వాలతో ఆధ్యాత్మికతలతో అవగాహనలతో వివేకాలతో విజ్ఞా నాలతో వివేచనలతో అల్లుకున్న గొప్ప అనుభూతుల సంగమం ఎంత గొప్పవా డైనా పరిధుల్లో పరిభ్రమిం చడమే ప్రకృతి మనకు కట్టబెట్టిన ప్రాథమిక సూత్రం ((గ్రహాలను గమనిస్తే బోధపడుతుంది) .

ప్రకృతి కట్టబెట్టిన మిన్న తనాన్నే ఇంకా ఇంకా సానబెట్టుకునే దిశగామనిషి మనిషిగా మసులు కోవాల్సిన నిత్య విధానాలకు మనిషిగా అమ్మానాన్నలతో తోబుట్టు వులతో కట్టుకున్నవారితో కన్నవారి తో మిత్రులతో గురువులతో శిష్యు లతో తల్లితో చెల్లితో ఆలితోసాటి మనుషులతో ప్రకృతితో పశుపక్ష్యాదులతో ప్రవర్తించాల్సిన తీరులో ప్రదర్శించాల్సిన పరిపక్వ తలను మనిషి సాటి మనిషితో నిలుపుకోవాల్సిన బంధనాల బలోపే తానికి సత్యం ధర్మం న్యాయం నడతలలో నడకలలో పాటించాల్సిన సమున్నత మార్గాలకు ప్రకృతి పట్ల పాటించాల్సిన బాధ్యతలను పశుపక్ష్యాదుల పట్ల వ్యవహరించాల్సిన తీరును బడుగు బలహీనుల పట్ల చూపాల్సిన కరుణను గురువుల పట్ల ఆడవారి పట్ల నిలపాల్సిన గౌరవాలను పసిపిల్లలపై పండించాల్సిన ప్రేమలను

ఆధ్యాత్మికతలను అవపోషణ పట్టి అనితర సాధకుడిగా ఆవిర్భవించాల్సిన స్థితిగతులను మానవుని జీవితములో చుట్టూరా 360 డిగ్రీల కోణంలో నిత్యం జరిగే పరిస్థితులకు స్పందన ప్రతి స్పందనలకు సంబంధించిన అనేక కోణాలను విషయాలను పరిగణనలోకి తీసుకుని తెలిపిన శ్రీ శర్మగారి ప్రవచనాలకు శ్రీ రాకుమారాగారు అలతి అలతి పదాలతో అత్యంత సొగసుతో చక్కటి పదబంధాలతో బహు చక్కటి అలంకారాలతో విషయ స్పష్టతలతో క్లుప్తతలతో భాషా పరిపుష్టితో భావ గర్భితమై భవ్యమైన రీతిలో మన ముందుకు తెచ్చారు .

అన్నీ ఆటవెలదులే. ఆంజనేయుని తోటలోని తాజా పూలే పరిమళాలు వెదజల్లే పటిష్టమైన భావాల తెలుగు భాషల మూటలే.తెలుగు వారికి

ఉత్తరీయమెంత ఉన్నతమో మనం సినారె గారి మాటల్లో విన్నాము. అందుకే ఈ గ్రంథం తెలుగు సాహితీవనంలో అంత గొప్పగా నిలిచిపోతుందనే భావంతో ముచ్చటైన ఉత్తరీయమ నడంలో నా ఉద్దేశం.

ఈ పుస్తకాన్ని తీసుకురావడంలో ఎంతోమంది కృషి చేశారు. అందులో ముఖ్యంగా శ్రీ బండి చంద్రమౌళి గారి పాత్ర అమోఘం .

-నగునూరి
రాజన్న
8332963129

'సూక్ష్మ కావ్యం'

ప్రముఖ కవి
బుర్రా వెంకటేశం ఐఎఎస్ అధికారి సృష్టించిన
'సూక్ష్మ కావ్యం" ప్రక్రియలో ఈ కవితలు
-ఎడిటర్

పల్లె - పట్టణం

పచ్చని సంపదకు ఆనవాలం నేను
పసిడి హంగులకు నిలయం నీవు!
ఆత్మీయతానురాగాల పొదరిల్లు నేను
నొసటి పలకరింపులకు నిలయం నీవు!
ఉమ్మడి కుటుంబాలకు రుజువు నేను
పరిమిత కుటుంబాలకు నెలవు నీవు!
కర్కశులతో కలకలలాడేదీ నేను
కార్మికులను గుంపు చేసేది నీవు!
చల్లని వాతావరణం లో నేను
వెచ్చటి కాలుష్యంలో నీవు!
కోడి కూతతో మేలుకునేది నేను
అలారంమోతతో మబ్బువీడేది నీవు!
ప్రశాంతమైన సాగరం నేను
అల్లకల్లోలమైన కడలివి నీవు !
పచ్చని ప్రకృతి మధ్య సేద తీరేను నేను
కాంక్రీట్ భవనాలమధ్య
మాడిపొయేవు నీవు !
మేమందరమూ అని బతికేది నేను
నే నొక్కరినే నని జీవించేది నీవు !
అందరితో కలివిడిగా నేను
ఎవరితోనూ కలవక ఒంటరిగా నీవు !
అందరు నా వారని జీవించేది నేను
ఎవరికి వారేనని బతుకెళ్లదీసేది నీవు !
ప్రశాంతమైన జీవనం తో నేను
ఉరుకుల పరుగుల జీవితం తో నీవు !

నాన్న-నేను

మార్గదర్శిగా నిలిచేవాడు
ఆ మార్గంలో పయనించేది నేను.!
మనసు తెలుసుకొని నడిచేవాడు
మమతను ఆహ్వానించేది నేను.!
ఎర్రటి ఎండలో గొడుగై నిలిచేవాడు
ఆ గొడుగు కింద సేదదీరేది నేను.!
మంచి చెడులను తెలిపే వాడు
గుర్తెరిగి నడుచుకునేది నేను.!
మన ఉన్నతికి తపించేవాడు
ఆ తపనను తీర్చేది నేను.!
మన కోసం గొప్ప కలలను కనేవాడు
ఆ కలలో వాస్తవం చేసేది నేను.!
తాహతుకు మించి కష్టించేవాడు
కష్టం విలువ తెలిపే పెరిగేది నేను.!
లక్ష్యం తీర్చడంలో సాయపడే వాడు
ఆ లక్ష్యాన్ని ఎంచుకునేది నేను.!
తను కోల్పోయినది నాలో
చూడాలనుకునే వాడు
నమ్మకాన్ని వమ్ము చేయకూడదు
అనుకునేది నేను.!
నిత్య అనుభవ శీలి నాన్న
ఆ అనుభవాన్ని అర్థం చేసుకునేది నేను.!
బంగారు కొండ అని మురిసిపోయేవాడు
బంగారు కలలు కనేది నేను.!
అద్భుతమైన నేస్తం నాన్న
జీవితాంతం తోడు నాన్నకు నేను.!

కవి-కవిత

కాగితం మీద రాసేవాడు
కవి హృదయంలో నుంచి వచ్చేది.!
ప్రకృతి పిపాసకుడు
ఊహ వాస్తవాల మధ్య రేఖ.!
కలంతో శాసించేవాడు
అందరినీ ప్రేరేపించేది.!
కత్తి కన్నా బలమైనదన్నాడు
ప్రజల గుండెలను తట్టేది.!
అనుభవాన్ని రంగరించి వ్రాస్తాడు
అక్షర తాండవమై నిలిచేది.!
జీవిత సత్యాన్ని తెలిపేది
తీరని వేదనగా నిలిచేది.!
ఒకరు రాయమంటే రాయనివాడు
కదిలించే సంఘటనలకు నెలవు.!
నిప్పుల కొలిమిలో నుంచి బయటకు
వచ్చేవాడు
వజ్రమై భాసిల్లేది.!
నిగూఢతను కలిగినవాడు
తీరని దాహం వంటిది.!
సృజనాత్మకశక్తి కలవాడు
జీవితాన్ని నిర్దేశించేది.!
నిరంతర సాధకుడు
మనల్ని నడిపించేది.!
అన్యాయంపై కలం ఎక్కుపెట్టేవాడు
అక్షరం గొప్పతనాన్ని తెలిపేది.!

పాఠశాల విద్యార్థి

ప్రశాంతమైన లోగిలి
భయంతో తొలి అడుగు.!
ఆత్మీయంగా అక్కున చేర్చుకునేది
స్నేహితులను యిచ్చేది.!
పలక బలపం అందించేది
దానితో చక్కగా దిద్దేవాడు.!
జ్ఞానానికి పదును పెట్టించేది
నిరంతర సాధన చేసేవాడు.!
ఆటలకు నిలయము
ఆటల తోడ సహవాసము.!
విద్యార్థుల జ్ఞాపకాల తడి
ప్రతిరోజు కొత్త మార్పు.!
ప్రగతికి పురోగమనం
నేర్చుకోవడం తెలుసుకునేది.!
అమ్మ ఒడి లాంటిది
అద్భుత ఖజానా ఇచ్చేవాడు.!
మమతల దేవాలయం
జ్ఞానాన్ని ఆర్జించేవాడు.!
అనుభవాలెన్నో రుచి చూపేది
నిత్య పిపాసి.!
కమ్మని అనుభూతిని మిగిల్చేది
భవితకు బాటలు వేసుకొనేవాడు.!
పంచటము నేర్పించేది
పతాక స్థాయికి చేరుకునేవాడు.!

రైతు-రాజు

కరవాలం చేతపట్టినవాడు
నాగలితో పొలము దున్నేవాడు.!
శ్రమ ఆయుధంగా కలవాడు
బుద్ధి, ధైర్యముతో ముందుకుసాగేవాడు.!
పుడమి బిడ్డడు
క్షత్రియ పుత్రుడు.!
అంబలి సంకటితో గడిపేవాడు
పంచభక్ష పరమాన్నాలతో భుజించేవాడు!
భూమి తోడ సహవాసం
శత్రువుల తోడ సహవాసం.!
అందరికీ ఆహారం అందించేవాడు
అందరినీ కాచేవాడు.!
కష్టించే తత్వం కల హాలికుడు
దేశ పరిపాలకుడు.!
నేలపై ఆకుపచ్చని సంతకం
ప్రజల రక్షా కవచం.!
మట్టిని నమ్ముకొని బతికే వాడు
శత్రువులను మట్టుపెట్టే వాడు.!
పంటలను పండించే వాడు
జనాల క్షేమాన్ని కాంక్షించే వాడు.!
వర్షపు చినుకుకై ఎదురు చూసేవాడు
అనుక్షణం జాగురూకుడై ప్రజలను
కాచేవాడు.!
నాణానికి రెండువైపులా ఉన్నవారు
ఒకరు రైతు మరొకరు రాజు.!

ఇల్లు-మేము

ఆనందాల సంబరం
ఆనందాలను దోసిట పట్టేవాళ్ళం.!
కలకలలాడే తోరణం
తోరణాలుగా నిలిచేది మేము.!
ప్రేమానురాగాల కలబోత
కలిసికట్టుగా ఉండి సాధించేది.!
పచ్చని చెట్లతో ఉండేది
ఆ చెట్లను నాటేది మేము.!
మనం అనే భావన నేర్పేది
ఐక్యమత్యం తోనే సాధ్యం
చేసుకునేది మేము.!
దానధర్మాలు చేసి లోగిలి
పుట్టుకతోనే అందిపుచ్చుకున్నాము.!
కష్టసుఖాల కలబోత
ఏదైనా కలిసి పంచుకునే వాళ్ళం.!
తులసి బృందావనం మా ఇల్లు
అందులో మొక్కలము మేము.!
ఎన్నో చిలిపి పనులకు ఆలవాలం
ఆ పనులను చేసేది మేము.!
జ్ఞాపకాల మధురిమ ఇల్లు
జ్ఞాపకాలను మూటగట్టుకునేది మేము.!
ఎన్ని సంవత్సరాలైనా మరిచిపోలేనిది
తీయని అనుభూతితో మునిగిపోయేది మేము.!
అనుభవాలను నేర్పించేది
అనుభవసారంగా మిగిలేది మేము.!

గురువు..శిష్యుడు

ఓనమాలు దిద్దించువాడు
నేర్చుకునే ప్రయత్నం చేయువాడు.!
చక్కగా చదువు చెప్పువాడు
విద్యను గ్రహించే వాడు.!
మంచి చెడు అనేవి తెలియజెప్పువాడు
విజ్ఞత ఎరిగి మసలుకునేవాడు.!
సంస్కారం నేర్పువాడు
సంస్కారాన్ని అలవరచుకునే వాడు.!
వినయం, విజ్ఞానం అందించువాడు
నిత్య జ్ఞాన పిపాసి.!
తోడుగా నిలబడేవాడు
ధైర్యముగా ఉండేవాడు.!
భవితకు బాటలు వేసేవాడు
ఆ బాటలోనే పయనించువాడు.!
తన అనుభవ సారాన్ని అందించువాడు
అనుభవాన్ని అందిపుచ్చుకునే వాడు.!
మార్గదర్శిగా నిలిచేవాడు
మార్గాన్ని ఏర్పరుచుకునే వాడు.!
ఉన్నత స్థాయిలో చూడాలనుకొనేవాడు
ఉన్నతంగా ఎదగడానికి ప్రయత్నం చేసేవాడు.!
లక్ష్యాన్ని నిర్దేశించే వాడు
ఆ లక్ష్యాన్ని చేరుకునే వాడు.!
స్ఫూర్తి ప్రధాత,జీవిత దర్శకుడు
జీవితాన్ని మంచి మార్గంలో నిర్దేశించుకునేవాడు.!

సూర్యుడు -చంద్రుడు

దినమున ప్రభవించేవాడు
రాత్రిలోన మెరిసేవాడు.!
కణ కణ లాడే గోళము
వెన్నెల శోభ భరితము.!
అరుణ వర్ణంలో అలరారేను
వెండి రంగుతో మురిసిపోయేను.!
జనుల జీవనానికి ఆధారం
జనుల ప్రశాంతతకు నిలయం.!
పగటిపూట వెలిగే రాజు
చీకటిలో దారి చూపే రేడు.!
పనులు చేయడంలో సహాయపడేది నేను
ప్రశాంతతకు నిలయం నీవు.!
వెలుగులు గుప్పించేది నేను
మబ్బుల చాటున దాగేవు నీవు.!
ఉరికే ఉత్సాహం నేను
కాంతి రేఖవు నీవు.!
బంగారు వర్ణంతో అలరారేది నేను
మచ్చలు ఎన్ని ఉన్నా ముత్యానివి నీవు.!
ప్రపంచానికి ఉనికిని నేను
నా సహచరుడివి నీవు.!
వృక్షాలకు ఆయువు పోసేది నేను
ఆ శోభను అందంగా మెరిపించేది నీవు.!
దారులు వేరైనా గమ్యం ఒకటేనని అంటాను నేను
ఒక కొమ్మకు పూసిన రెండు పువ్వులం
మనమని అంటాను నేను.!

-సునీత బండారు
9440671530

తంగేడు పూలవేడుక

పుడమి తల్లి తనువు మీద
పూసిన పూలన్నీ ..
బతుకమ్మగా మారి మురిపిస్తున్నయి.
వనంలో పూసిన తంగేడు పూలన్నీ..
పచ్చని వేడుకై వెన్నెల వెలుగులు కురుపిస్తున్నయి.
తెలంగాణ నేలంతా పూసిన గునుగుపూలన్నీ
తెల్ల"ధనం"తో...దీవిస్తున్నయి.
బంతిపువ్వులన్ని బతుకునిచ్చే బతుకమ్మను
చల్లంగా దీవించని వేడుకుంటున్నయి.

నిండుకుండలా చెరువులు ...కావువలన్నీ..
కలకళలాడుతూ... కర్షకుని కళ్ళల్లో
కన్నీరును తుడిచివేస్తమంటున్నయి
పచ్చని పంటలన్నీ పంటకావును
పదిలంగా పదికాలాలపాటు పదిలంగా
చూసుకుంటామంతున్నయి.
కాలమంతా ఆకుపచ్చని అమ్మలా మారి...
నిండు మనసుతో బతుకమ్మను ఆహ్వానిస్తోంది.

తీరొక్క పూలతో బతుకమ్మ జాతర.
ప్రతి ఇల్లు ప్రమిదల కోవెల.
ఊరు వాడ కోలాటాలతో..
బతుకమ్మ పాటలతో...సిత్తూ సిత్తూలబొమ్మ
శివుని ముద్దుగుమ్మ అని...
పార్వతి పరమేశ్వరులను ప్రార్థిస్తున్నవి.
రంగురంగుల పూలల్లే...హరివిల్లుల
జీవితాన్ని ఇయ్యమని ఊరువాడంతా
వేడుకుంటున్నవి.
తెలంగాణ నేలపై పూలపండుగ.
ఉద్యమాల గడ్డపై కోటికాంతుల పతాక
నింగినేలంతా దసరా ఉత్సవాల గీతిక.
పూలన్నీ దేవుళ్ళయి నిండుగా..
జనులను దీవించే జనజాతరల వేడుక.
ప్రకృతమ్మ పచ్చని పందిరై..
అందరిని చల్లంగా కాపాడే పండుగ.

-అశోక్ గోనె
9441317361

మా బడి

పలక, పడవ, పనస అంటూ
అక్షరాలను పరిచయం చేయును
పదాలతో పాటలతో
అలరించు మా బడి
పాటలతో,ఆటలతో ఆలోచన పెంచును
ప్రజ్ఞా,పాటవాలను పద్ధతిగా నేర్పును
పచ్చని తరువులే ప్రగతికి మెట్లని
పిల్లాపాపలతో చెట్లను నాటిన
పుడమిన పుత్తడి పండునని మాత
పితలకు ఉద్బోధ చేసే మా బడి
ప్రపంచీకరణలో ముందుకెళ్ళాలంటే
పెంపొందాల్సింది నాగరికత కాదు
పైరు పంటలతో సాగును
ప్రాణాంతకమైన
ప్లాస్టిక్ తరిమివేతలో అని
మార్గం చూపె.
పౌరులతో భారతావని
పచ్చగా శోభిల్లాలంటే
పచ్చలహారంలా చెట్లు పుడమి
తల్లిమెడన అలంకరించాలని
ప్రేమారగా ప్రకృతి ని చేరదీస్తే
శత వసంతాల నవకాంతి
మానవునిదని తెల్పె
మా చదువుల గుడి

-సి.హేమలత
9666779103

వెలుగు కావాలి

అజ్ఞాన అంధకారాన్ని
తొలిగించడంలో
నీవే ఒక వెలుగు కావాలి
అవినీతి అరాచకాలను
అరికట్టేడములోనీవే
ఒక ఆయుధం(సాధనం) కావాలి
చరిత్ర నిర్మాణములో
నీవే ఒక శక్తివి
కావాలి
నివే సామాజిక మార్పుకు
అగ్రేసరుడివి కావాలి
శాస్త్ర సాంకేతిక మార్పులకు
నీవే ఒక మలుపు కావాలి
నీవే ఆనందానికి అడ్రస్ కావాలి
నీవే ఆత్మీయతకు
అనురాగాలకు వేదిక కావాలి
నీవే స్నేహ దీపం కావాలి
స్నేహ దీపం వెలుగులొ
ఇతరుల జీవితాలలో
బరోసా భద్రత కుచోట్టివ్వాలి
అజ్ఞానాన్ని తొలిగించి
విజ్ఞాన విపంచివై
వివేచన
విశ్లేషణ
వివేకానికి
నీ ఆలోచనలు పునాదులు కావాలి
జ్ఞాన విజ్ఞాన ప్రదాతవై
సమాజ సమరతకై
సమరంచేసే నిత్య చైతన్యశక్తి వై
నీవు నిలవాలి
నవతకు భవితకు నూతన
బాటలు వెయ్యాలి

-నేదునూరి కనకయ్య
9440245771

గెలుపు నీ సొంతం

పట్టువదలని ప్రయత్నం
కరుడుగట్టిన ధైర్యమే
నీ పంతమైతే...

వమ్ముకాని నమ్మకం
అమ్ముడుపోని నిజాయితీలే
నీ అమ్ములైతే...

అచంచలమైన అనురాగం
మహోన్నత మమకారమే
నీ పంచన చేరితే...

సడలని సంకల్పం
వడలని ఉత్సాహం
నీ ఆయువుపట్టులైతే...

విజయమిక నీ సొంతమే
గెలుపెపుడూ నీకు అనుకూలమే!

-అయిత అనిత
సెల్: 89853 48424

"శ్రీసీమంతం"

(కథ)

పుండరీకాక్షయ్య గారింట్లో పేరంటాల సందడి.

ఏమిటిటా విశేషము?

వాళ్ళ కోడలికి సీమంతమట. వియ్యాల వారు చాలా గొప్పవారు. ఇన్నోవా నిండా ఫలహారాలు, మిఠాయిలు, అరటి గెలలు, ఇంటిల్లిపాదికి పట్టు బట్టలు అబ్బో ఇంకా ఎన్నో! పక్కింటావిడతో కబుర్లు. ఊరందరిని పేరంటానికి పిలిచారు. పిలిచినప్పుడు వెళ్ళక పోతే బాగుండదు మరి . మనమేమో వాళ్ళ తాహతుకు తగక రాలేదను కుంటారు. గొప్పింటి వాళ్ళ ఇంట్లో సీమంతం ఎలా ఉంటుందో చుడాలి గా మరి ! ఓ సారి వెడితేనే సరి.

పేరంటాళ్ళ సందడి హాలులో మారు మ్రోగుతోంది. సావిత్రమ్మ అందరిని సాదరంగా పలకరించి ఆహ్వానిస్తోంది. వచ్చిన వారంతా ఒకరినొకరు పల్కరించుకుంటూ కబుర్లాడుకుంటున్నారు. ఇంతలో "ఏం వొదినా ఎన్నాళ్ళయింది నిన్ను చూసి మరీ నల్లపూసవైపోయావు" అంటూ సుశీలమ్మ పలకరింపు మీనాక్షమ్మని.

''ఏం చెప్పమంటావు మీ అన్నయ్య పని తోనే సరిపోతుంది రోజంతా . పొద్దున్న లేచిన దగ్గర నుంచి ఎవరో ఒకరు రావడము. మా అమ్మాయికి పెళ్లి ముహూర్తము చూడండి అనో అన్నప్రాసన ముహూర్తము చూడండి అనో వొడుగుకి మంచి ముహుర్తాలు ఉన్నాయా అనో ఒకరి తరువాత ఒకరు రావడము ఈయన గారు తననే గదా అడుగుతున్నారు అని వొళ్ళు మర్చిపోయి అదే పనిలో మునిగి పోయి ఏ ఝాముకీ భోజనానికి రాక అపరాహ్ణము దాటిపోవడము నిత్యం జరిగే బాగోతమే."

"సరే భోజనాలయి ఇలా నడుం వాల్చానో లేదో" "ఏమోయ్ మబ్బు పట్టి వర్షం వచ్చేలా వుంది దొడ్లో బట్టలు తీయి అంటూ ఒకటే నస. ఎలాగూ లేచావుగా కాఫీ తో పాటు వేడిగా కొంచెం పకోడీలు చెయ్యి అంటూ సన్నాయి నొక్కులు" ఇంకా నాకు తీరికెక్కడ పెత్తనాలకి.

''వీళ్ళ వియ్యాలరు బాగా వున్నవాళ్ళటగా అంది గుస గుసగా కాంతమ్మ" అవును మరి అబ్బాయి పెద్ద చదువులు చదివి ఫారిన్ లో ఉద్యోగము, ఒక్కడే పిల్లాడు అందుకే ఏరి కోరి వీళ్ళ సంబంధము చేసుకున్నారట అని మరొకరు. పెళ్ళిలో అమ్మాయికి బంగారము ఘనంగానే పెట్టారుట. వియ్యపరాలికి కూడా బంగారపు గొలుసు, పట్టు చీర పెట్టారుట. ఇంతలో సావిత్రమ్మ అటుగా రావడముతో మాటలు ఆపేసారు.

సావిత్రమ్మ మాత్రం తక్కు వదా! తమ వియ్యాలారి గొప్పదనము తమ హోదా చూపించుకోవా లిగా మరి ! అందుకే ఊర్లో తెలిసిన వారందరిని కోడలు సీమంతానికి పిలిచింది. ఎంతయినా ఆ ఊర్లో పేరుమోసిన కుటుంబమాయె మరి ఆ మాత్రం చెయ్యకపోతే ఎలా ?

అమ్మాయ్ నేను చెప్పినవన్నీ ఏర్పాటు చేసావా? అంటూ పురోహితుల వారు ప్రవేశించారు. వస్తూనే మూడు ఇరవై కె ముహూర్తం అన్నారు.

ఆ ఆ అన్ని రెడీగా వున్నాయ్ పంతులుగారు అంది సావిత్రమ్మ. వియ్యపురాలు తెచ్చిన వన్నీ పళ్లేం నిండా పెట్టి, పళ్ళు, పూలు, గాజులు వగైరా సిద్ధం చేసింది. సావిత్రమ్మ మరొక పక్క తమ తరఫునుంచి పంచదార చిలుకలు, చందనం బొమ్మలు, ముత్తైదువులకు ఇచ్చే తాంబూలాలు , రవికల బట్టలు తయారుగా పెట్టింది.

వచ్చిన వారంతా ఒక్క సారిగా నిశబ్దమయిపోయి మాటలు ఆపేసారు. వీడియొ గ్రాఫరు, కెమెరా వాళ్ళు కూడా ప్రవేశించారు. ఇంకా ముహూర్తంకి పది నిమిషాలు టైముంది. అమ్మాయిని బ్యూటీ పార్లర్ అమ్మాయి తయారు చేస్తోంది. పంతులు గారు అమ్మాయిని తీసుకు రండి అని తొందర పెడుతున్నారు. వచ్చేస్తున్నాం అంటూ లోపలినుంచి జవాబు. ముహూర్తము దాటి పోకూడదు. త్వరగా రావాలి అని పంతులుగారు ఒకటే తొందర చేస్తున్నారు. అక్కడ అమ్మాయి ముస్తాబు పూర్తి అవలేదు. ముహూర్తము దాటిపోతుందని అందరికి ఆత్రుత. పంతులుగారు గట్టిగా అరిచారు..... కోపంగా ముహూర్తబలం మీకు తెలియడం లేదు అని విసుక్కుంటున్నారు. వెంటనే సావిత్రమ్మ గబ గబా లోపలి వెళ్లి సగం మేకప్‌తో వున్న కోడలిని తీసుకు వచ్చేసింది. అమ్మాయిని చూసి పేరంటాళ్ళందరూ ఒకటే ముసి ముసి నవ్వులు. అమ్మాయికేమో చాలా సిగ్గుగా వుంది. వీడియొ, ఫోటో వాళ్లకి తీయొద్దని చెప్పేసింది.

మరి ఈ కాలంలో ముహూర్తా నికంటే వీడియోలకు, ఫొటోలకే ఎక్కువగా ఎక్కువ ప్రాధాన్యత ఉంటోందిగదా ! ముహూర్తాలు దాటిపోయే ఘంక్షన్లు అనేకం చూస్తున్నాము. పూర్వకాలంలో ముహూర్త బలం అని ఒక్క సెకను గూడా అటు ఇటు కానివ్వకుండా జరిపేవారు.

ముత్తైదువులందరు గాజులు తొడగడానికి, పూలు పళ్ళు పెట్టడానికి ముందుకు వస్తుంటే పంతులు గారు "మీరంతా వుండడమ్మా! అవన్నీ తరువాత చేద్దురు ముహూర్తము దాటి పోకుండా ముందు పిల్ల తల్లి పిల్ల వొళ్ళో చలిమిడి, పూలు, పళ్ళు పెట్టాలి" అని మంత్రం మొదలు పెట్టారు. ముహూర్తము పూర్తి అయిన తరువాత వేడుకలు ఎన్నయినా చేసుకోవచ్చు అన్నారు. ఓహో ఇది పెద్దింటి పద్ధతి గాబోలు అని వెనక్కి తగ్గారు అందరు.

రుస రుసలాడుతూ మొహం ముడుచుకుని కూర్చుంది. కూతురు మొహం చూసి 'ఇంకేం హంగామా చేస్తుందో అని భయపడి తల్లి తబడుతూ ముందుది వెనక వెనకది ముందుగా పిల్ల వొళ్ళో ముందుగా చీర పెట్టబోతుంటే "పంతులుగారు అమ్మా ముందు చలిమిడి, పళ్ళు, పూలు పెట్టాలి ఆ తరువాత చీర పెట్టాలి'' అన్నారు. అప్పుడు పంతులుగారు చెప్పినట్లే అన్ని పెట్టింది. తరువాత అత్తగారు కూడా పెట్టడము పూర్తి అయి ముహూర్తము టైముకే కార్యక్రమము అయిందనిపించారు.

> "అంతేలే మరి, మనరోజులేమిటి పెద్దవాళ్ళు ఎలా చెబితే అలా నడుచుకోవడానికి. ఈ కాలం ఆడ పిల్లలు చదువుకుని మగవాళ్ళతో సమానంగా ఉద్యోగాలు వెలగబెడుతున్నారాయె!"

"ఇంకొంచెము ఉంటే ముహూర్తము దాటిపోయేదే'' అన్నారు పంతులు గారు. అమ్మయ్య అని అమ్మలక్కలందరు ఊపిరి పీల్చుకున్నారు.

ఫార్మాలిటీ పూర్తి అవుతూనే అమ్మాయి టక్కున లేచి మేకప్ పూర్తి చేసుకోవడానికి లోపలికి వెళ్ళిపోయింది. మేకప్ పూర్తి అయి ముప్పావు గంట తరువాత అమ్మాయి వచ్చింది. ఇక మళ్ళీ వీడియొ, ఫోటోల రీటేక్ కార్యక్రమము మొదలయి ఇంకో ముప్పావుగంట నడిచింది. వచ్చిన వారంతా వెళ్లాలనే తొందరలో వున్నారు.

తరువాత ముత్తయిదువులందరు ఒక్కొక్కరుగా అమ్మాయి చెప్పినట్లే అంటి అంటనట్టుగా బొట్టుపెట్టి, గాజులు తొడిగి దీవించారు. కార్యక్రమమంతా పూర్తయ్యేసరికి ఇంకో గంట పట్టింది.

మూడుగంటలకే ముహూర్తము అన్నారని హడావిడిగా రెండుగంటలకే బయలుదేరి వచ్చారాయె మరి. అప్పుడే ఆరయిపోయింది. అందరికి వెళ్లాలనే తొందర. అందరు సావిత్రమ్మ గారు ఇచ్చిన పసుపు కుంకుమ, తాంబూలము తీసుకుని నెమ్మదిగా నిష్క్రమించారు. ఇల్లు గాలివాన వచ్చి వెలిసినట్లు నిశబ్దముగా అయింది.

ఎంతయినా ఆడంగులు కదా మరి పోస్ట్ సీమంతం కబుర్లు చెప్పుకోకుండా వెళ్ళలేరు. బయటకు వస్తూనే జంటలు జంటలుగా గుసగుసలు మొదల్లయ్యాయి.. "ఇదేమి విచిత్రమమ్మా సీమంతము అంటే ముత్తైదువులంతా కడుపు చలవ కోసం బొట్టు పెట్టి ,పూలు పెట్టి, పళ్ళు చేతిలో పెట్టి ఆశీర్వదిస్తారు. అటువంటిది ఆ పిల్ల పూలు పెట్టించుకోలేదు సరిగదా బొట్టు గూడా వొద్దంది. మేకప్ పాడయి పోతుందిట." అని ఒకావిడ అంటే మరొకావిడ "అంతే కాదు రేపు వాళ్ళ అబ్బాయి వచ్చాక మళ్ళీ అన్నీ చేస్తున్నట్లు వీడియో తీస్తారుట వాళ్ళ ఫ్రెండ్స్ కి చూపించడానికి". "ఓహో ఇవన్నీ డబ్బున్న వాళ్ళ పద్ధతులు కాబోలు" అని మరొకావిడ. ఇళ్ళకి వెళ్లాలని తొందర పడినవాళ్లు విధి చివర నుంచుని కబుర్లాడుతున్నారు. "

"అంతేలే మరి మనరోజులేమిటి పెద్దవాళ్ళు ఎలా చెబితే అలా నడుచుకోవడానికి. ఈ కాలం ఆడ పిల్లలు చదువుకుని మగవాళ్ళతో సమానంగా ఉద్యోగాలు వెలగబెడుతున్నారాయె! డబ్బు సంపాదన వున్నప్పుడు నోరెత్త లేరు మరి అని మరొకావిడ సన్నాయి నొక్కులు." "వియ్యాల వారు రేపే పిల్లని తీసుకు వెడతారు అంది సావిత్రమ్మ మరి రేపు ఈ వీడియొ తతంగము ఎలా చేస్తారుట? ఆ దానిదేముందిలే వియ్యాల వారు ఇంకో రోజు వుండే వెడతారు.'' అంది మరొకావిడ. ఇవీ పేరంటాళ్ళ కబుర్లు.

మొత్తాన్ని పుండరీకాక్షయ్య గారి కోడలు సీమంతము వూళ్ళో ఒక పెద్ద చర్చనీయాంశము అయిపో యింది.

మొదటి కానుపు ఏడవ నెలలోనే తీసుకు వెడదామని వియ్యపురాలు, వియ్యంకుడు వచ్చారు. మరునాడే ప్రయాణము. సావిత్రమ్మ, పుండరీకాక్షయ్య గారు వియ్యంకుడికి, వియ్యపురాలికి ఘనంగా బట్టలు పెట్టి, బహుమతులు ఇచ్చి పంపించారు.

వియ్యాల వారిని సాగనంపాక సావిత్రమ్మ రాబోయే మనవడి గురించి కలలు కనడం మొదలెట్టింది. పైకి ఎంత మోడరన్ కాలంలో ఉంటున్నాఆడవారి మనసుల్లో జీర్ణించుకు పోయిన పాత పద్ధతులు, పాత ఆలోచనలు ఎక్కడికి పోతాయి! అందుకే సావిత్రమ్మ గారి ఆలోచనలు వంశోద్ధారకుడు మగపిల్లవాడే పుట్టాలని తాను అందుకు తగ్గట్టు ఆర్భాటం గా అన్నిముచ్చట్లు జరపాలని కలలు కనడం మొదలెట్టింది.

మనవడు పుడితే తమ గొప్పతనము, ఆడంబరాలు చూపించుకుందామని తెగ ఉబలాట పడిపోతోంది. వంశోధారకుడు మనవడు వచ్చాక కోడలి సీమంతం కంటే గొప్పగా మనవడిని ఉయ్యాలలో వేయడము, మూడో నెలలో ముద్దలు పంచిపెట్టడము, పాకుతే పాయసము పంచిపెట్టడము వగైరా వగైరాలు ఊహించుకుని మురిసిపోతోంది.

అంతే మూడు నెలలు యిట్టె గడిచి పోయాయి.

ఒకనాడు వియ్యంకులు వారి వద్దనుంచి ఫోను. " మీ కోడలికి ఈ రోజు డెలివరీ అయింది ఆడపిల్ల పుట్టింది. తల్లి, పిల్ల క్షేమంగా వున్నారు" అని. అది విని మగపిల్లాడు పుడతాడు అచ్చట్లు ముచ్చట్లు తీర్చుకుందాము అనుకున్న సావిత్రమ్మ ఒక్క సారిగా నీళ్లు కారిపోయింది. ఆవిడ ఉత్సాహమంతా పొంగిన పాలమీద నీళ్లు చల్లినట్లు చప్పబడిపోయింది.

సావిత్రమ్మ కూడా ఆడదయి ఉండి ఆడపిల్ల అనగానే నిరుత్సాహపడిపోవడము ఎంతవరకు సబబు ఈ కాలంలో గూడా ఆడ మొగా అంటూ వివక్షత చూపడము ఆశ్చర్యం అనిపించడం లేదూ ?

-శ్రీమతి. లంక సీత
9868145541

బతుకు చెరుపుకుంటున్నరు..!

అడవులను నరుకుతూ
అమ్మకానికి పెడుతూ
ఆదివాసుల పొట్టకొడుతూ
ఆగం చేస్తున్నరు...

కాంక్రీటు వనాలు నిలుపుతూ
కాలుష్యాన్ని పెంచుతూ
కాలాన్ని మార్పులకు గురిచేస్తూ
కష్టాలు పెడుతున్నరు..

విరివిగా రసాయనాలాడుతూ
భూసారమును తగ్గిస్తూ
భూ,జలచరజీవుల ప్రాణాలు తీస్తూ
సమతుల్యత పోగొడుతున్నరు..

పచ్చని చెట్ల ప్రాణం తీస్తూ
ఫ్యాక్టరీలకు ఆజ్యం పోస్తూ
పొగతో గాలి కాలుష్యం చేస్తూ
రోగాలకు గురిచేస్తున్నరు..

రోజు రోజుకంతా
రోగాలెక్కువవుతుండెను
నూరేండ్ల జీవతానికి
నిమ్మలం లేకుంటాయెను
అర్థాయుష్షు తోడ
అంపశయ్య నెక్కుతుండెను
జీవిగంజి దొరుకకనే
జీవినొదులుతుండెను

ఈ ఘోరాన్ని కండ్లారా చూసి
కాపాడలేకున్నము
జరిగేటి నష్టము తెలిసి
జాగృతి కాలేక పోతున్నము
ఇదేనా ధర్మం..ఇదేనా కర్తవ్యం..!
కలిసి కదలండి ముందుకు
రక్షణ కల్పించుకొండి
బతుకులకు...!!

-పసుల.శంకర్
9542181301

పల్లె విలువ ..!

పల్లెలు మనసున్న మల్లెలు
పల్లెలు ప్రేమలకు పొదరిల్లు
పల్లెలు బంధాలకు బొమ్మరిల్లు
పల్లెలు ఆప్యాయతలకు అంకురిల్లు
పల్లెలు అనురాగాలతో ప్రజ్వరిల్లు !

పల్లెలు మనసున్న మల్లెలు
పల్లెలు కళలకు కళానిధులు
పల్లెలు ఆచారాలకు సన్నిధిలు
పల్లెలు సంస్కృతికి సారథులు
పల్లెలు సంప్రదాయాల వారధులు!

పల్లెలు మనసున్న మల్లెలు
పల్లెలు పచ్చని చెట్లకు మార్గాలు
పల్లెలు పాడి పంటలకు స్వర్గాలు
పల్లెలు జల సవ్వడుల నిలయాలు
పల్లెలు ఇల సంపదల ఆలయాలు!

పల్లెలు మనసున్న మల్లెలు
పల్లెలే రైతన్నలకు పంచ ప్రాణాలు
పల్లెలే ఇంటింటి పచ్చటి గుమ్మాలు
పల్లెలే దేశానికి పట్టు కొమ్మలు!!!

-బోనగిరి. పాండు రంగ
8341212132

ధరిత్రీ దినోత్సవం...!

ధరణిలోనపచ్చదనము నిండుగనున్న
కలదుసుఖము కలకాలమందు
కరుణకల్గిమనకు కామితార్థములివ్వ
ధన్యమగును జన్మధాత్రిలోన!

పరమపావనంబు పరగధరిత్రియును
వెల్గులీనవలెను వెచ్చగాను
యుద్ధభీతిచేత నుత్సాములునుచచ్చు
సమరమన్నవలదు సవ్యముగను!

పుడమిలోనిప్రజలు పూజ్యులైవిలసిల్ల
మహిసహాయినొందు మధురముగను
అన్ని దేశములును నన్నో న్యముగనున్న
చీకుచింతలేదు సిరులునిండు!

దేశదేశములును దేదీప్యమానంగ
జిలుగుపంచునాడె జీవితములు
సంతసంబులొలుకు సంబరములతోడ
పుడమితనువు మిగులపులకరించు!

శాంతితోడనున్న సకలదేశాలు
పరిమళించు వేగప్రతిభతోడ
సమతమమతలన్ని సామరస్యముతోడ
మానవీయపథము ధరణివెలుగు!

మొక్కవోనిదీక్ష మొక్కలెన్నోనాట
నవ్వలనందనంబు నాదుధరణి
మురిపెముగనుతాను ముక్కాలములలోన
సర్వజనులగాచు సత్యముగను!

-డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి
8555899493

అరచేత మాయాజాలం

నేటి తరానికి అంతర్జాలం
ఒక గొప్ప మాయాగాలం
మొబైల్ చేత పట్టుకుంటే చాలు
ఎన్నో కొంగ్రొత్త విషయాలు వాలు
ఏది తెలుసుకోవాలన్నా
నిమిషకాలమే చాలు
నిరంతరం పని శోధనయే
సెల్ఫోన్ సాధనయే
ట్రైనింగ్ యైనా షాపింగైనా
లర్నింగైనా జాయినింగైనా
మెయిలింగైనా సెర్చింగైనా
అన్నింటికి ఆలవాలం అంతర్జాలం
ఇది కొందరికి ఆటవిడుపు
ఇంకొందరికి బతుకుతెరువు
సాంకేతిక ఆవశ్యకత
పెరిగిన నేటితరం
వారికి ఈ అవకాశం ఒక వరం
ఆకాశపుటంచుల్ని ,శిఖరాగ్రాల్ని
సముద్రాల్ని ,లోయల్ని
ఖనిజాల ఉనికి ఇలా
శోధనకు కాదేది అనర్హమని
జ్ఞానసముపార్జన చేసుకో!
అంతర్జాల దుర్వినియోగం మానుకో
కొందరి దుర్నీతి దుండుడుకు
సైబర్ నేరాలకు ముందడుగు
అత్యుత్సాహంతో అనవసర
అంశాలపై శ్రద్ధ పెట్టి
జీవితాలను పణంగా పెట్టి
సాంకేతికతను అధఃపాతాళానికి
తొక్కుతూ నిందలపాలుచేస్తూ
నిరుపయోగ పరుస్తున్నారు
అంతర్జాలాన్ని అందంగా
ఆనందంగా అవసరం మేరకు వాడుకో
జీవితాన్ని సరిదిద్దుకో
కొత్త ఒరవడి సృష్టించుకో

-సంధ్య సుత్రావె
9177615967

ఆధునిక తరం

కాఫీ కప్పు
చేతికి రావడం ఆలస్యమైతే
ఎదో చెప్పలేని చిరాకు
న్యూస్ పేపర్ ఆలస్యమైతే ఎదో చెప్పలేని చికాకు
ఎండ ఎక్కువగా కాస్తే
ఎదో చెప్పలేని ఆగ్రహం
కొందరి మాటలు వింటే ఎదో చెప్పలేని విసుగు
కొందరి చేష్టలు చూస్తే ఎదో చెప్పలేని ఆవేశం
అత్తమామలను సహించలేని కొత్త కోడళ్ళు
తల్లితండ్రులను భరించలేని
నేటి యువతరం కొడుకులు
బంధువులతో సత్సంబంధాలు
కోల్పోయిన నవనాగరిక జీవులు
ఇరుగు పొరుగు వారితో
కలసివుండటం సాధ్యంకాని
నేటి ఆధునిక పౌరులు
అందుకే అసంతృప్తి , అశాంతి
వాళ్ళ సొంతమై అలమటించడం

- డా॥ పులిపర్తి కృష్ణమూర్తి
సెల్:9949092761

మనకొద్దీప్లాస్టిక్కు..!!

విలాసాల మోజులోన వినాశాలు మొదలాయె..
వాడిపడేసే వస్తువు వాడకాలు ఎక్కువాయె..!!

కడలిలోన జలచరాల కదలికలే ఆగిపోయె..
పుడమితల్లి కడుపులోన పుండులాగ మారిపోయె..!!

మేథస్సును చిలికిచిలికి విషజ్వాల చిమ్ముతుంటె..
భస్మాసుర హస్తమయ్యె ప్లాస్టిక్కుల అందాలు..!!

మానవాళి మనుగడలో విజ్ఞానం భాగమైతె..
క్షేమంగా ఉండాలి రేపటితరం మన తదనంతరం..!!

భవిష్యత్తు బాగోగులు కోరుకోని నేటితరం..
స్వార్థ ప్రయోజనాలను కోరుతోంది నిరంతరం..!!

సాగుతున్న సంచులను చేతబట్టి సాగుతుంటె..
కాటేసే పాములకే పాలుపోసి సాకినట్టె..!!

పాలకులకు ప్రహసనమట ప్లాస్టిక్కుల నిషేధం..
ప్రతినలతో యేటేటా ఇదోరకం వినోదం..!!

మన సమాజ శ్రేయస్సుకు పట్టుకున్న చీడ ఇది..
సమూలంగ మూలాలను వదిలించుట మన విధిగా..!!

ఉత్తరకుమార గొప్పలు చెప్పటాన్ని మానేద్దాం..
పర్యావరణ పరిరక్షణకు అనుక్షణం శ్రమిద్దాం..!!

-పేరిశెట్టి బాబు
9247170800

అమ్మ

ఇక్కడ చీకటి రాత్రులలో నన్ను
జోకొట్టి నిద్ర పుచ్చేది !

కళ్లలో కన్నీటిని దాచి పెదాలతో
సంతోషాన్ని పంచేది !

ఒక్కొక్కప్పుడు
మధురమైన క్షణాలను
ఆప్యాయతలను చెవిలో చెప్పేది !

మనసు కలత చెందకుండా మాధుర్య
మమతలను పంచేది !

ఒట్టిపోని కవిత్వాన్ని నా ఖాళీ
పుటలపై లిఖించేది.!

స్వచ్ఛమైన నిర్మలమైన ప్రేమను
నిరంతరంగా అందించేది !

స్నేహపూరితంగా నన్ను తాకేది
ఒక్కోసారి కౌగిలింతలో
దగ్గరగా తీసుకునేది !

ఒక్కొసారి నా కంటనీటిని
తన చీరతో తుడిచేది !

కలల ఊయలలో నన్ను
నెమ్మదిగా ఊపేది !

ఆకలి అనే బాధను
తెలియకుండా కడుపునింపేది !

మొత్తం ప్రపంచంతో అలిగి
నేను కోపంతో నిద్రపోయినపుడు !
నెమ్మదిగా నాపైకి దుప్పటి లాగి
తన కొంగులో నన్ను దాచుకునేది !

-పగిడిపల్లి సురేందరు పూసల
80748 46063

పుస్తక సమీక్షలు

అనేక అంశాల మేళవింపు 'సున్నితం చంద్రికలు'

చంద్రికలు అంటేనే సుగంధ భరితమైన లేదా పౌర్ణమి నాడు వచ్చే వెన్నెల అనే అర్థం వస్తుంది అనుకుంటాను.

పుస్తక ముఖచిత్రం అదే భావాన్ని తనలో నింపుకున్నట్లు కనిపిస్తుంది.

చల్లని వెన్నెల వేళ విరిసిన సుమపరిమళం, నింగి వైపు సాగుతున్నట్లు...వెన్నెల చిరుజల్లులు సుమాన్ని అభిషేకిస్తున్నట్లు.....

కవయిత్రి మనోభావాలకు దర్పణం ముఖచిత్రం అనిపిస్తుంది.

సాహిత్య ప్రియులకు, ముఖపుస్తక కవులకు/కవయిత్రులకు సోదరి దీకొండ చంద్రకళ పేరు కొత్తగా పరిచయం చేయవల్సిన అవసరం లేదు.

కారణం వివిధరకాల సాహిత్య సంస్థలు నిర్వహించే పోటీల విభాగంలో

ప్రతినిత్యం విజేతగా నిలుస్తూ పురస్కారాలు అందుకుంటూ ఎందరో వర్ధమాన కవులకు,

కవయిత్రులకు ప్రేరణగా కనిపిస్తుంటారు కనుక.

"సున్నితం చంద్రికలు" తెలుగు సాహిత్య రంగంలో నూతన ప్రక్రియలో వెలువడిన తొలి కవితా సంకలనం

వేమన శతకంలోని పద్యాలను ఎంతగా ఆస్వాదిస్తావో, ఈ సున్నితం చంద్రికలను అలాగే ఆస్వాదించగలం.

నూతన ప్రక్రియలో వెలువడిన సంకలనంలో, విభిన్నమైన నలభై అంశాలను తీసుకుని సున్నితాలను రచించడం వారిలోని సాహిత్యాభిలాషను తెలియచేస్తుంది.

తల్లి ప్రేమగా ఉగ్గు పాలతోనే తన బిడ్డకు తెలుగు భాషలోని స్పష్టత, నేర్పు, భావం, కూర్పు నేర్పుతుంది. అందువలననే ఎందరో కవులు, కవయిత్రులు, తెలుగు సాహిత్య రంగంలో తమ ఉనికిని చాటుకుంటున్నారు.

ఎందరో మహనీయులు, కవులు, కవయిత్రులు మన తెలుగు భాష యొక్క ప్రాముఖ్యతను చాటి చెప్పారు. అటువంటి మరో ప్రయత్నం చేసారు దీకొండ చంద్రకళ గారు.

ఎక్కడ మనసుకు నిర్భయత్వమో
ఎక్కడ జ్ఞానం వెల్లివిరుస్తుందో
అదే రవీంద్రవిరచిత స్వేచ్ఛా స్వర్గం

చూడచక్కని తెలుగు సున్నితంబు...అంటూ ఎందరో కవులకు , ప్రేరణగా నిలిచిన గీతాంజలి కావ్య సృష్టికర్త ,

రవీంద్రనాథ్ ఠాగూర్‌ను తమ సున్నితం ప్రక్రియలో అలా కీర్తించారు.....

కన్యాశుల్కంపై శివవెత్తిన గురజాడ
దేశమంటే మట్టికాదని చాటెను
లోకమందు రెండే కులములనెను
చూడచక్కని తెలుగు సున్నితంబు..

అంటూ సంఘసంస్కర్త గురజాడ స్త్రీ జనోద్ధరణకు జరిపిన కృషిని తెలియచేసారు.....

నేనుసైతం అంటూ విప్లవించిన
సమసమాజ సంస్థాపన ప్రవక్త
అభ్యుదయ కవితాయుగ ప్రయోక్త
చూడచక్కని తెలుగు సున్నితంబు... అంటూ విప్లవ సాహిత్యంతో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన మహా కవి శ్రీశ్రీ లోని విప్లవ కవిని వివరించారు.

దివాళా అంచునున్న ఆర్థికవ్యవస్థను
ప్రగతి పట్టాలెక్కించిన ఘనుడు
నేటిభారతం రేవి పీవి
చూడచక్కని తెలుగు సున్నితంబు

....అంటూ ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు,అపర చాణుక్యుడు అని పిలువబడే పివీ.నరసింహారావుగారిని కీర్తించారు.

అదే విధంగా
మౌనంగా పడివున్న మొండిరాళ్ళు
కరిగి సప్తస్వరాలను మీటే
శిల్పి రామప్ప హస్తనైపుణ్యంతో
చూడచక్కని తెలుగు సున్నితంబు..అంటూ

కాకతీయ వంశస్తుల కాలంలో కళారంగం ఎంతగా అభివృద్ధి చెందిందో అందరికీ తెలుసు.

అందుకు నిదర్శనంగా నిలిచిన రామప్ప వైభవాన్ని సున్నితంబుగా మలచారు.

అపూర్వ మూర్తిమత్వ నిధి
మన దేశానికి దొరికిన పెన్నిధి
ప్రజాప్రసిడెంటై నిలిచిన దయానిధి
చూడచక్కని తెలుగు సున్నితంబు..

అంటూ భారత దేశంను అంతరిక్ష పరిశోధనల్లో ప్రథమంగా నిలిపేందుకు కృషి చేసి భారత రాష్ట్ర పతిగా సేవలు అందించిన డాక్టర్ ఏ.పి.జే అబ్దుల్ కలాం గారిని కవిత్వీకరించారు.

వ్యక్తిగత శాంతే విశ్వశాంతి
సానుకూల ప్రకంపనల శాంతి మంత్రం
పాటించాలి ప్రపంచమంతా ఒక్కటై
చూడచక్కని తెలుగు సున్నితంబు..
అని శాంతిని కాంక్షిస్తూ..

దేశ స్వాతంత్ర్యం కోసం నిర్విరామంగా తపించి, ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్త్ర బహిష్కరణ నినాదంతో బ్రిటిష్ వారిని గడగడలా డించిన గాంధీ మహాత్ముని గురించి శాంతి ప్రవచనంలా సున్నితంబును అందించారు.

జైజవాన్- జైకిసాన్ అనే నినాదంతో

సంస్థానాల విలీనంలో ప్రముఖ పాత్ర వహించిన సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను కీర్తిస్తూ...

జనులను తన సాహిత్యంతో చైతన్య వంతులను చేస్తూ, నిజాం పాలనపై ప్రజలు తిరుగుబాటు చేసేలా నంసిద్ధం చేసిన డా.దాశరథి కృష్ణమాచార్య గారి సాహిత్యంను సున్నితంగా కవితలా మార్చుకుంటూ...

వీర వనిత,ఎందరో మహిళలు స్వాతంత్ర్యం సంగ్రామంలో భాగస్వామ్యులు కాగలిగేందుకు ప్రేరణగా నిలిచిన

ఝాన్సీ లక్ష్మీబాయి ధైర్యసాహసాలను విజయగాథగా వినిపిస్తూ.....

తన పాటల్తో పగలే వెన్నెలలో విహరించిన అనుభూతిని కలిగించేలా గీతాలను రచిస్తూ, నిగ్గదీసి అడుగు ఈ సిగ్గులేని జనాన్ని అని సూటిగా ప్రశ్నించిన సిరివెన్నెల సీతారామశాస్త్రి గారికి తన అక్షర సుమాలతో నీరాజనాలు అర్పిస్తూ....

ఇలా అనేక రంగాల్లో నిష్ణాతులైన వారిని

తన సున్నితాల్లో అద్భుతంగా ఆవిష్కరించిన ఘనత సోదరి దీకొండ చంద్రకళ గారిది అని చెప్పక తప్పదు.

తెలుగు భాష పట్ల తమకు ఉన్న మక్కువను కూడా ఇలా సున్నితం అన ప్రక్రియలో పొందు పరిచారు.

అమ్మ పాలలా కమ్మనైన భాష

పొరుగు రాజులు వెచ్చిన మెరుగు భాష

ఆశుకవిత్వాల అవధానుల మేటి భాష

చూడచక్కని తెలుగు సున్నితంబు..

అంటూ

తెలుగు భాష మాధుర్యాన్ని రుచి చూపించి...

మూఢనమ్మకాలను ఖండిస్తూ...

పౌష్టికాహారం ఆవశ్యకతను తెలియచేస్తూ..

రక్తదానంతో నలుగురి జీవితాలను కాపాడుమని హితవు పలుకుతూ...

తెలంగాణ పండుగ బతుకమ్మ..
పూలతో దేవతలను కాక
పూలనే దేవతలుగా కొలిచి
పోషక నైవేద్యాలను నివేదింతురు.. అంటూ పండుగ పరమార్థం వివరిస్

పరవస్తు లోకేశ్వర్ రచించిన "చార్మినార్ కథలు" ఆవిష్కరణ

'చార్మినార్ కథలు' సంపుటి ఆవిష్కరణలో జూలూరు గౌరీశంకర్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్, పరవస్తు లోకేశ్వర్, డా॥ మామిడి హరికృష్ణ, ఖదీర్‌బాబు.

ఈ నేల సహజీవనానికి ఆనవాళ్లు 'చార్మినార్ కథలు' అని తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్ అన్నారు. అన్వీక్షికి ప్రచురించిన పరవస్తు లోకేశ్వర్ 'చార్మినార్ కథలు' సంపుటిని శుక్రవారం రవీంద్రభారతి మినీహాల్లో 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె. శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ పరవస్తు లోకేశ్వర్ రాసిన 'చార్మినార్ కథలు' చదువుతుంటే డెబ్బై ఏళ్ల కిందటి పాతనగర వైవిధ్యతను,విశేషాలను చూడలేకపోయామన్న భావం కలుగుతోందన్నారు. ఒక్కో కథ మధ్యలో వ్యాఖ్యానాన్ని జోడించడంతో పాటు అందులో తారసపడే ప్రాంతాల పేర్లు, మనుషుల మధ్య సహజీవనం అంశాలతో సంపుటిలోని 16 కథలూ ఆసక్తికరంగా ఉన్నాయన్నారు. కథనంలోని పాత్రలను ఘటనలను రచయిత పోల్చిన తీరు పాఠకులను ఆకట్టుకుంటుందన్నారు. 'జ్ఞాపకమనేది పదునైన రాజకీయ పరికరంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ఓ వర్గాన్ని ప్రతినాయక పాత్రలో చూస్తున్న మిగతా సమాజానికి సవ్యమైన అవగాహన కలిగించడానికి ఈ కథలు తోడ్పడతాయని కె. శ్రీనివాస్ శ్లాఘించారు. ప్రముఖ రచయిత మహమ్మద్ ఖదీర్ బాబు పుస్తక సమీక్ష హృద్యంగా సాగింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డా॥మామిడి హరికృష్ణ మాట్లాడుతూ ఈ కథల ద్వారా చార్మినార్ తన కథలను తానే చెప్పుకొంటున్నట్లు ఉందని అన్నారు. కథా రచయిత పరవస్తు లోకేశ్వర్ మాట్లాడుతూ సామరస్యం నేడు జీవనం ప్రమాదంలో పడ్డాయనే బుగులు (భయం) నుంచి నమ్మకం కలిగించడానికి ఈ కథా సంపుటి తీసుకొచ్చానని తెలిపారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్త సినీ సహాయ దర్శకుడు కమల్ వ్యవహరించగా అన్వీక్షికి ప్రచురణ కర్తలు వెంకట సిధారెడ్డి, మహీ బెజవాడ పాల్గొన్నారు.

విశ్వ ప్రగతికి పునాది ఉపాధ్యాయుడే..!

(05 అక్టోబర్ "ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం" సందర్భంగా)

బ్రహ్మ, విష్ణు, మహేశ్వర రూపాలన్నీ సమ్మిలితమై గురువుగా ఇలలో వెలసి మన ముందు నిస్వార్థ మార్గదర్శకులుగా ఉన్న సంగతి మనందరికీ తెలుసు. నడిచే పరబ్రహ్మగా ఉపాధ్యాయులు రాబోయే విశ్వ తరాలను నిర్మించే మహాయజ్ఞంలో తమ గురుతర బాధ్యతలను విస్మరించక, తమ జీవితాశయాలుగా మలుచుకొని సమాజ దశ దిశలకు బాటలు వేస్తున్నారు. ప్రపంచంలో గురువులేని వ్యక్తి ఉండరు. నిరక్షరాస్యుడి జీవితంలో కూడా తను నమ్మిన గురువు చూపిన మార్గంలో అడుగులు వేస్తారు. నేటి బాలలను రేపటి బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దే నిస్వార్థ జీవులే గురువులు. అన్ని వృత్తులలోకెల్ల ఉపాధ్యాయవృత్తి అత్యంత గౌరవం కలిగినదిగా పేర్కొనబడింది. యువత సన్మార్గంలో నడవడానికి పునాదులు వేసే బాధ్యత తల్లితండ్రుల తరువాత ఉపాధ్యాయుడి మీదనే అధికంగా ఉంటుంది. అమ్మ, నాన్న తరువాత మూడో తల్లి/తండ్రిగా గురువును అభివర్ణిస్తారు.

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం-2022 నినాదం:

విశ్వవ్యాప్తంగా ఉపాధ్యాయుల పాత్రను అభినందించడం, కృతజ్ఞతలను తెలియజేయడం, స్మరించుకోవడం మరిచిపోరాదని 'ఐరాస' (ఐక్యరాజ్యసమితి)లోని అతిముఖ్య విద్యా శాఖ యునెస్కో (యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్) 05 అక్టోబర్ 1966న తీసుకున్న నిర్ణయం ప్రకారం 1994 నుండి ప్రతియేటా 05 అక్టోబర్ రోజున "ప్రపంచ/అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం" పాటించడం జరుగుతుంది. శిశు తరగతి నుండి ఉన్నత విద్య వరకు అధ్యాపకుడి భూమిక ప్రతి దశలో ఉంటుంది. "ప్రపంచ ఉపాధ్యాయ దినం-2022" నినాదంగా "ఉపాధ్యాయుల నుండే విద్యా పరివర్తన ప్రారంభం" తీసుకొని, ఉపాధ్యాయుల బోధనాపద్ధతిలో వచ్చిన ఆధునిక అనివార్య మార్పులను సవాలుగా తీసుకొని చక్కని బోధనలు చేయడానికి సన్నద్ధం అవుతున్నారు. కొన్ని సందర్భాలలో తల్లితండ్రులు చెప్పే విషయాలను కూడా నమ్మని పిల్లలు గురువుల బోధనలను తూచా తప్పక గుడ్డిగా నమ్మతారనేది వాస్తవం.

ఆధునిక బోధనా పద్ధతుల ఆకలింపు:

అంతర్జాతీయ స్థాయి విషయ పరిజ్ఞానాన్ని స్వంతం చేసుకొని, ఆధునిక బోధనా పద్ధతులను ఆకలింపు చేసుకొని, పిల్లల మానసిక స్థితిని పసిగడుతూ ఆకర్షనీయ బోధన చేసే విధంగా శిక్షణ తీసుకోవడం లాంటివి ఉపాధ్యాయుల కనీస అవసరాలుగా ప్రపంచదేశాలు భావిస్తున్నాయి. యువతలో విద్యాప్రమాణాలు పెరగాలన్నా, నాణ్యమైన బోధనలు జరగాలన్నా ఉపాధ్యాయులకు ఉన్నత స్థాయి శిక్షణలు తప్పని సరియని దేశాలన్నీ గుర్తించాయి. స్థానిక విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించడంతో మాత్రమే మన రేపటి యువత అంతర్జాతీయ వేదికల్లో రాణించగలుగుతారు. మారుతున్న జీవనశైలి, వెల్లువెత్తుతున్న శాస్త్రసాంకేతికత, విశ్వమే కుగ్రామం అయిన రోజులు, కరోనా విజృంభనతో విద్యాలయాలు మూతపడడంలాంటి పెను సవాళ్ళ మధ్య విద్యాబోధన ప్రక్రియ ప్రమాదంలో పడుతున్నది. వైజ్ఞానిక విప్లవ విస్ఫోటనానికి అనుగుణంగా ఉపాధ్యాయులు నవీన కొత్త పోకడలను అవగాహన చేసుకొని, తరగతి గదిని ఆటపాటల వేదికగా, ఆసక్తికర బోధనా పద్ధతులను ఆశ్రయించాల్సి ఉన్నది. విపత్తు నిర్బంధనల నడుమ ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ బోధనలకు అలవాటు పడుతూ, విద్యార్థులను ఆకర్షించాల్సిన బాధ్యత గురువుల మీదనే ఉంది.

జీవిత పాఠాల బోధనలు:

ఉపాధ్యాయులు నిర్వహించే పలు బాధ్యతలలో ఒకటి పాఠ్యాంశాల బోధన మాత్రమే కాదు. దీనికి తోడుగా గురువు మంచి స్నేహితుడిగా, మూడో తల్లి/తండ్రిగా, మోధావిగా, మార్గదర్శిగా, ప్రేరకుడుగా, తప్పడుగులను సవరించే హితుడిగా, సరైన జీవనశైలిని నేర్పే అన్నగా, ఆటపాటల్లో తమ్ముడిగా, పరిపాలనాదక్షుడిగా, సన్మార్గాన్ని చూపే ఆదర్శమూర్తిగా, మంచి సలహాదారుగా, జీవనతత్వాన్ని రుచిచూపే తత్వవేత్తగా అనేక పాత్రలను ఏకకాలంలో నిర్వర్తించాలి. సుఖ జీవనానికి తగు జీతాన్ని, జీవించే కళను నేర్పడమే ఉపాధ్యాయుల బాధ్యత అని అర్థం చేసుకోవాలి. సమాజానికి డాక్టర్, యాక్టర్, లాయర్, ఇంజనీర్, రాజకీయ నాయకుడు, వ్యాపారి, ఆదర్శ ఉద్యోగి, కలెక్టర్, పోలీస్ లాంటి అన్ని వృత్తుల వారిని తయారు చేసే మేధో వితరణ మనోబల యంత్రమే ఉపాధ్యాయుడని మనకు తెలుసు.

ఉపాధ్యాయుల ఉన్నత లక్షణాలు:

తరగతి గదిలో పాఠ్యాంశాలను బోధించే వారు సాధారణ ఉపాధ్యాయులుగా, స్పష్టతతో వివరించే వారు మంచి ఉపాధ్యాయులుగా, నేర్చుకుంటూ ఎదగాలనే ప్రేరణ కలిగించే వారు ఉత్తమ ఉపాధ్యాయులుగా సమాజంలో పేరు తెచ్చుకుంటారు. విద్యార్థుల్లో నిగూఢంగా దాగివున్న అభిరుచులు, ఆసక్తులను సున్నితంగా విశ్లేషించి, వారి ఎదుగుదలకు నిచ్చెనలా నిలబడగలిగిన వ్యక్తి గురువు ఒక్కరే. ఉపాధ్యాయుడిలో క్రమశిక్షణ, జ్ఞాన సంపన్నత, మార్గనిర్దేశనం, నిర్వాహకయుక్తి, అంకితభావం, కరుణ, బోధనాభిరుచి, అవగాహనా సామర్థ్యం, ఓపిక, ఆదర్శంగా నిలవడం, నియంత్రణాశక్తి, శ్రమించే తత్వం, సంభాషణా చాతుర్యం, జ్ఞాన వితరణలో ఆసక్తి లాంటి ఉన్నత లక్షణాలు ఉండడం తప్పనిసరి అని గురువు నమ్ముతాడు. సమాజానికి వెన్నుముఖగా నిలబడగలిగిన వారే గురుబ్రహ్మలు. దేశ ఆర్థిక సామాజిక నైతిక అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిది. వనరుల కేంద్రం, కనిపించే ధైర్యం, నడిపొచ్చే దైవం, నైపుణ్య కొండ, వ్యక్తిత్వ వికాస అండ, విజ్ఞాన నిధి, శ్రేయస్సును కోరే పెన్నిధి, అనంత విశ్వాసాల సన్నిధిగా గురువు బహుముఖ పాత్రలలో ఒదిగి, సమాజ ఎదుగుదలకు ఉత్ప్రేరకంగా నిలిచే నిస్వార్థజీవి ఉపాధ్యాయుడు మాత్రమే. ఉపాధ్యాయులు వృత్తిలో అలసత్వం వహిస్తే, రాబోయే తరాల పునాదులు కదిలి, బలహీనపడి, సమాజం అల్లకల్లోలం అవుతుందని మరువరాదు. నేటి ఆధునిక వేగవంతమైన డిజిటల్ ప్రపంచంలో ఉపాధ్యాయులు తమ విధులను విస్మరించక, విలువల బీజాలను లేత మనస్సుల్లో నాటి, మేధో మహా వృక్షాలుగా ఎదిగేలా సాధన చేసి, విశ్వశాంతికి, నవ్య ప్రగతికి బాటలు వేయాలని ఆశిద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

అసలైన మానవతావాది తిరునగరి-నందిని సిధారెడ్డి

మనసూ,మనసు కలిస్తే కవి, మనిషీ,మనిషి కలిస్తే దేశం అన్న అసలైన మానవతావాది తిరునగరి అని తెలంగాణా సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు శ్రీ నందిని సిధారెడ్డి అన్నారు. కవనమిత్ర సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆలేరులోని శ్రీరామకృష్ణ విద్యాలయంలో జరిగిన కవితిలక, డాక్టర్ తిరునగరి సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

విశ్వమానవ కళ్యాణాన్ని వించే వాడే కవి అంటూ, మానవులంతా సమానమే అన్న సమతావాది, డా.తిరునగరి తెలుగు సాహిత్యంలో తెలంగాణ కవిగా చిరస్మరణీయమైన స్థానాన్ని దక్కించుకున్నారని ఆయన కొనియాడారు.

పద్యం,గేయం,వచన ప్రక్రియలలో అందెవేసిన చేయిగా సాహితీ రంగంలో ఐదు దశాబ్దాల కృషిని కొనసాగించిన తిరునగరి ప్రాచీన, ఆధునిక సాహిత్యాల వారధిగా నిలిచారని చెప్పారు.

గొప్ప సాహితీవేత్తల సాహిత్యాన్ని నాలుక మీద నిలుపుకునీ,వారి కవితలు నిరంతరం వినిపించిన వ్యక్తుల్లో ముఖ్యులు తిరునగరి అన్నారు.

దాశరథితో ఎంతో సాన్నిహిత్యం కలిగిన తిరునగరికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన దాశరథి పురస్కారాన్ని ఇచ్చి గౌరవించడం ఆయన సాహిత్య ప్రతిభకు నిదర్శనమని తెలిపారు. తిరునగరి చూపిన సాహిత్య ఒరవడిలో కొత్తతరం రచయితలు అధ్యయనం,సృజనలతో ముందుకు సాగాలని సిధారెడ్డి సూచించారు.

శ్రమించేవారే దేవుళ్లు అని పేర్కొంటూ రాసిన 'శ్రమదేవోభవ' అనే 'దోరదేటి' ఖండ కావ్యానికి తిరునగరి పద్యసాహిత్య పురస్కారం లభించడం చాలా

సముచితంగా ఉంది అని ఆయన అన్నారు.స్త్రీల యొక్క సమస్యలతో పాటు అనేక సామాజిక సమస్యల సమాహారం 'ఇక మారాల్సింది నువ్వే' అనే 'పెనుగొండ సరసిజ' సంకలనానికి తిరునగరి వచన కవితా పురస్కారం లభించడం ఔచిత్యంగా ఉంది అన్నారు.

తిరునగరి సాహితీ సేవలను గుర్తు చేస్తూ,వారి పేరున స్మారక పురస్కారాలు ప్రతి సంవత్సరం ఇవ్వాలని సంకల్పించిన కవనమిత్ర సాహితీ సంస్థ అధ్యక్షులు పెసరు లింగారెడ్డిని హృదయ పూర్వకంగా అభినందించారు.

ఆలేరు ప్రాంతంలో పుట్టి,పెరిగి తెలుగు సాహిత్య రంగంలో ఉన్నత స్థానానికి ఎదిగిన, తిరునగరి గారి సాహిత్య కృషిని యువ కవులకు అందించాలనే ఆశయంతో వారి పేరున సాహిత్య పురస్కారాలు ఇవ్వాలని సంకల్పించడం ఆయనకు అసలైన నివాళి అని గౌరవ అతిథిగా హాజరైన డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రజా సంబంధాల అధికారి డా? పెసరు వేణుగోపాల్ రెడ్డి అన్నారు.

కవన మిత్ర సాహిత్య, సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు పేసరు లింగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాహిత్య పురస్కార గ్రహీతలు దోరవేటి, పెనుగొండ సరసిజ, ప్రముఖ విద్యావేత్త బండిరాజుల శంకర్, యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, ప్రధాన కార్యదర్శి బందారు జయశ్రీ, తొర్ర ఉప్పలయ్య,భోగ హరినాథ్,డా. పాండాల మహేశ్వర్,వల్లాల విజయలక్ష్మి,వెంకన్న,సతీశ్,ప్రదీప్, దేవినేని అరవిందరాయుడు, ప్రజాభారతి సంస్థ సభ్యులు, శ్రీరామకృష్ణ విద్యాలయం అధ్యాపకులు,విద్యార్థులు సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

శ్రీ కళామంజరి - షాద్‌నగర్, తెలంగాణ
సాదర ఆహ్వానము
" కళ కళ కోసం కాదు, ప్రజల కోసం"
లక్ష్మీహయగ్రీవ స్వామి తలయం, వెంకటేశ్వర కాలని, మహబూబ్‌నగర్‌లో
తేది : 06-10-2022, గురువారం, సా॥ 3:30 గంటలకు
'అవధాన కళాజరి', శతావధాని
శ్రీ అమురాల మురళి గారి ద్విగుణిత అష్టావధానము
సభాధ్యక్షులు :
'రాగీ ప్రియ' 'జన ప్రియ కవి' శ్రీ ఏలూరి యంగన్న గారు, అనంతపురం
ఆత్మీయ అతిథులు
శ్రీ బండారి రమేష్ గారు, శ్రీ బాపన చంద్రశేఖర్ అధ్యక్షులు, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి, షాద్‌నగర్
శ్రీ ఎస్.వి. రాజేంద్ర ప్రసాద్ గారు, రాగూన్ హైస్కూల్, షాద్‌నగర్
శ్రీ అతావాది శశాంక మౌళి, వైస్ ప్రిన్సిపాల్, అర్ట్స్ కాలేజ్, అనంతపురం
డా॥ అతావాది సుధామ వంశీ, సంస్కృతోపన్యాసకులు, అర్ట్స్ కాలేజ్, అనంతపురం
స్వాగత నృత్యం :
'నాట్యమయూరి' శ్రీమతి వైదేహి గారి శిష్య బృందం
1) బంగారుతల్లి పాయి శ్రీనిధి, 2) సుందరవల్లి యశస్విని
పృచ్ఛకులు :
1) శ్రీ అత్తలూరి ప్రభాకర్ రావు గారు, బంధ కవి
2) శ్రీ లోకప్ప పల్లి గారు, అవధాని
సమస్య :
1) డా॥ పాలకురికి సోమనాథ శర్మ గారు, పద్యకవి, సంస్కృతోపన్యాసకులు
2) శ్రీ శతావధి చక్రధర్ శాస్త్రి గారు, అవధాని
దత్తపది :
1) శ్రీమతి కళ్ళ అరుణ గారు, తెలుగు పండితులు
2) శ్రీమతి పుర అరుణ గారు, కడుపుత్రి, తెలుగు పండితులు
వర్ణన :
1) డా॥ తంపర శ్రీకాంత్ గారు, ప్రముఖ కవి
2) శ్రీ కోళ్ళ వెంకట్రత్నం పిళ్ళ గారు, ప్రముఖ కవి, కాళోజీ అవార్డు గ్రహీత
అవధాన :
1) శ్రీ అల్లూరి వెంకటపతి గారు, తెలుగు పండితులు
2) శ్రీ పెద్దిపల్లి శంకర్ గారు, కవి, తెలుగు పండితులు
ధారణ వధానము :
1) డా॥ మల్లిపురపు రవీంద్ర గారు, కవి, పండితులు
2) ఉ. శారదాంబ కామేశ్వర్
నృత్యరూప :
1) శ్రీమతి యాదాద్రి శ్రీదేవి గారు, శ్రీకృష్ణదూత, శ్రీ పురిపల్లా గ్రహీత
2) శ్రీ కళ్ళ సీతారాములు శర్మ గారు, పద్యకవి, తెలుగు పండితులు
అష్టావధాన ప్రసంగం :
1) శ్రీ రంగిశెట్టి మల్లికార్జున శర్మ గారు, పోస్టుపుంగోలు, విజయవాడ
2) శ్రీ తిరపతి ప్రకాశ్ గారు, కవి, కథకులు
సర్వాదాయ సహితీ మిత్రులందరికీ సాదర స్వాగతం
మంకాల లక్ష్మీ మానస, ప్రధాన కార్యదర్శి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 649వ రోజు 'నియమం' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'నియమం' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా... –సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
–డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

ఒక నిబంధన...

గతి తప్పిన గమనం ప్రమాదం
మతి తప్పిన పయనం ప్రమాదం
శ్రుతి తప్పిన గానం కర్ణ కఠోరం
నీతి తప్పిన మాట అపజయం
నియమం తప్పి తిరిగిన నిష్మూరం!!.
నియమోల్లంఘన ప్రాణానికే ముప్పు
రెండు పట్టాలపై వెళ్లే రైలు
నియమ నిబంధన తప్పి నడిస్తే
యమలోకానికే టికెట్!!.
నియమానికి నీళ్లొదిలేస్తే
బ్రతుకే నీరుగారు
శరీర అవయవాలు
ఎక్కడ ఉండాలో
అవి అక్కడే ఉంటే ఉపయోగం
లేకుంటే అంతా గందరగోళం
దేవుడు పెట్టిన నియమం!!.
ప్రకృతి తన కట్టుబాట్లను
తానే ఏర్పాటు చేసుకుని
నియమం తప్పక
అన్ని కాలాలు చవి చూయిస్తుంది!!.
తూర్పునే ఉదయించడం
రోజు నియమం సూర్యునికి
ప్రకృతి నేర్పే గుణపాఠం
నియమం పాటిస్తూ
నియమానుసారం నడవాలనేదే!!.

–డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

క్రమబద్ధం

సూర్యుడు గతి తప్పక
నడుపుతాడు తన పరిక్రమ
చంద్రుడు అనుసరిస్తాడు రవిని.
సృష్టి అనీతా నియమంతో
నిర్విరామ నడక–
సలక్షణ చైతన్యంతో
ఒక అపస్వరం
పాటను
రాగాన్ని
రూపును
ఒరవడిని మార్చి
హత్య చేస్తుంది పాటని పూర్తిగా
అందుకే
నియమబద్ధమైన ప్రతి కార్యం
ఒక శాస్త్రపరిజ్ఞానం
కాలగతులు మారకుంటే
మనిషి బతుకు మారదు
కాలగతి క్రమం తప్పితే
బతుకే మారణహోమం.
ప్రకృతికైనా
జీవితానికైనా
జీవనానికైనా
కవిత్వమైనా
నియమనిబద్ధత నిత్యావసరం
తప్పకూడదు గతి
పాటకు ప్రాణం లయ
లయతప్పితే పాటకు మరణమే
నియమం జీవితానికి ఒక ఆశీర్వాదం
ఆచరించాలి
క్రమ పద్ధతిలో నిబద్ధతతో
మనసు పెట్టినప్పుడే
ప్రతి ఒక్కరూ విజయకేతనం
ఎగురవేయవచ్చు
ప్రగతిపథంలో
మునుముందుకు సాగవచ్చు.

–కె.కె.తాయారు

నియమం -జీవనమార్గం

గణిత శాస్త్రమైనా
జీవిత గమనమైనా
ఉంది తీరాల్సిందే ఒక నియమం
అప్పుడే సమస్య పరిష్కారం.
నియమానుసంధానం
చట్టం, న్యాయం, శాసనం
అతిక్రమిస్తే భారీ మూల్యం
ఇల్లూ కార్యాలయమూ దేశమూ
కావు దానికతీతం
నియమాలు పాటించిన నిలయం
స్వర్గధామం
ఇరుగు పొరుగుకి ఆదర్శ ప్రాయం
నియమాలు పాటిస్తే
సంస్థ సుభిక్షం
దేశం సురక్షితం
నియమాలు పాటించని నగరి
అది కుక్కలు చింపిన విస్తరి
నిత్యం పాటిస్తే సిరి
విస్మరిస్తే తప్పదు ఉరి
నియమం
జన్మకు సార్థకం
పాటించని జన్మ చేరు అధఃపాతాళం
కష్టమేమీ కాదు
నియమాల అనుసరణం
జీర్ణించుకుంటే క్రమశిక్షణ నరం నరం.

–జె.వి.కుమార్ చేపూరి

నియమం - విజయం

నియమ నిష్ఠలు
కాడి ఎద్దులు !
గాడి తప్పిన
చేటు తప్పదు !
దుక్కి దున్ని
విత్తు నాటి
విత్తు పైనే
అడుగు వేస్తే
మొక్క మొలవడం
సాధ్య పడదు !.
కార్య సాధనకు
నియమ నిష్ఠలు
లేకపోతే
అస్తవ్యస్తపు
పనులు జరిగి
శ్రమకు తగిన
ఫలిత మందక
బాధలే తుదకు!
పనులకు
నియమముంటే
అదుపు
హద్దులు
తోడు వుంటే
శ్రమకు తగిన
ఫలితం
విజయ మన్నది
సుసాధ్యం!.

– రామకృష్ణ చంద్రమౌళి

క్రమశిక్షణ

నిజమే!
వ్యక్తి క్రమశిక్షణకు మూలం
పాటించాల్సిన నిబంధనం
నియమ నిబంధనలు
పాటించినప్పుడు
సమస్యలు దూరం
కుటుంబ నియమాలైనా
దేశ నియమాలైనా
సక్రమంగా పాటించాలి.
పుట్టిననాటి నుండి
సమయపాలనతో
నియమ నిబంధనలతో
బిడ్డని పెంచుతుంది తల్లి
విద్యార్థిగా
పాఠశాల నిబంధనలను పాటించాలి
జీవన చక్రంలో అవి పరిపాటి
నియమాలు సంస్కృతిలో భాగం
సంఘ నియమాలు
ఆ దేశ సంస్కృతికి ప్రతిబింబాలు
కట్టుబాట్లు, క్రమశిక్షణ
వ్యక్తిత్వానికి దర్పణం
నియమాలు తప్పి
నియంతగా మారితే
దేశాధ్యక్షునికైనా తప్పవు దండనలు.
నియమం ఒక మంచి మార్గం
ఎందరో మహానుభావులు
నియమనిష్ఠలతో
అనుకున్నది సాధించారు
నియమం జీవన సోపానానికి
బతుకు సార్థకతకు నిదర్శనం
పాటించిన వారి జన్మధన్యం.

–చంద్రకళ దీకొండ

– సత్య మొంద్రేటి

అవసరం

నియమం లేకుంటే అయోమయం!
నాగరికత నేర్చి!
సంఘం ఏర్పరిచి!
మనుగడ నేర్చిన మనిషికి
కట్టు బొట్టు
కొలతల పరిధులు
అవసరం!
లేకుంటే విచ్చలవిడి
అరణ్య జంతు జాతితో సమానం!!
నీతి చంద్రికలు!
ధర్మ సూత్రాలు!
రక్త సంబంధ బంధాలు!
సంస్కృతీ ఆచరణలు!
పూజలు! కర్మకాండలు!
పుట్టుక! చావు! తతంగాలు!!
చట్ట ప్రబంధాలు!
అన్ని బతుకు సార్థకతకు సోపానాలే!
పాటిస్తే మనుగడకు అర్థం!
లేకుంటే అనాగరిక ఛిద్రం!!.

–జె.నరసింహారావు

వ్యవస్థలలో అవస్థలు

నియమం ప్రకారం
సంచరించే గ్రహాలు
కాలగతి
మానవ మనుగడకు
అభ్యుదయ బాటలు!.
క్రమశిక్షణ
కట్టుబాట్లు
నియమ నిబంధనలు
పాటించని మానవ జీవనం
అల్లకల్లోలం!.
నియమాలు పాటించని వ్యవస్థలతో
ప్రజల అవస్థలు వర్ణనాతీతం!
నియమాలు పాటించని విద్యార్థులతో
తరగతిగది అల్లరిమయం!.
నో పార్కింగ్ బోర్డు వద్దనే
వాహనాల నిలుపుదల
వందమంది
తప్పించుకోలేని నిర్దోషులే దోషులు
సర్వసాధారణం ఇక్కడ!.
విచ్చలవిడి విశృంఖలత్వాలు
దారం తెగిన గాలిపటాల చందాలు
నియమాల అతిక్రమణల
పర్యవసానాలే!.
నియమోల్లంఘనలతో
రహదారులు రక్తసిక్తం!.
మనోనిగ్రహం
నైతిక విలువలు
యమనియమాల వంటి నియమనిష్ఠలు
ట్రాఫిక్ లో
పచ్చ లైటు-ఎర్ర లైటు నియమాల్లా
సాఫీగా సాగే జీవిత పయనానికి
ప్రగతికి సోపానాలు!.
నియమం తప్పిన
ప్రకృతి వైపరీత్యాలకూ
ప్రళయాలకూ
మానవుల దురాశలూ
అత్యాశలే
మూలకారణాలు!.
పావ్ లోవ్ శునకంపై చేసిన
నియమ నిబంధనల
ప్రతిస్పందన ప్రయోగంలా
పిల్లలకు పసితనం నుంచే
నియమబద్ధంగా ప్రవర్తించే
శిక్షణనివ్వాలి
పెద్దలు ఆదర్శంగా నడుచుకోవాలి
సమాజం
రక్షితప్రాంతం కావాలి!!!.

–చంద్రకళ దీకొండ

– సత్య మొంద్రేటి

అనకట్టలు

మనిషి మనిషిలా బతికేందుకు
మనిషి ఏర్పరుచుకున్న కట్టుబాట్లు
సమిష్టిగా
ప్రజల నిర్ణయాలే
నియమనిబంధనలు
ఆయా దేశాల రాజ్యాంగాలకు
అవే ఆదర్శాలు..
నీతీ నియమాలతో
మంచీ చెడుల బేరీజుతో
ధర్మాధర్మ విచక్షణతో
పాపపుణ్యాల భావనలతో
తప్పొప్పులను వేరుచేసి
సునిశిత దృష్టితో
మానవ మనుగడకై
మనిషే నిర్ధారించుకొన్నవి.
ఒక్కో ప్రాంతానికి
ఒక్కోదేశానికి
ఒక్కోరకమైన నియమాలు
ఒక చోట నిరాకరించినవి
మరోచోట ఆచరించేవి కావచ్చు
ఏదేమైనా
మనిషి మృగంలా మారకుండా
కట్టడి చేసే ఆనకట్టలు.
ఏప్రాంతం వారైనా
వాటిని పాటించాల్సిందే
ఏదేశం వాడైనా
వాటికి తలవంచాల్సిందే
లేదంటే
తగు శిక్షకు సిద్ధపడాల్సిందే!.

–గుర్రాల వేంకటేశ్వర్లు

విశ్వజనీనం

నీతులూ
నియమాలూ
నిబంధనలూ
ఇదే చట్రంలో జీవితం
ప్రతి జీవికొక నీతి, నియమం, నిబంధన
నియమాలను పాటిస్తేనేగా
సౌఖ్యవంత జీవితం
క్రమబద్ధ జీవనం
నియమాలు
సంఘజీవికి ప్రాథమిక అవసరాలేగా
తప్పితే జీవితం అస్తవ్యస్తమేగా
దినసమయం కార్యశాలకు అంకితం
రాత్రి సమయం విశ్రాంతికే
మారుతున్నది జీవనశైలి నేడు
వేతనజీవులు నేడు
దినసమయంలో విశ్రాంతి
రాత్రి సమయంలో విధుల నిర్వహణ
ప్రాంతాల్లో దేశాల్లో నియమాల మార్పు
ఇక్కడి నియమాలు అక్కడ చెల్లవు
అక్కడి నియమాలు ఇక్కడ చెల్లవు
ఎక్కడైనా విశ్వజనీన నియమాలు
వసుదైక కుటుంబభావనలో
నేడు మనిషి.

–లక్ష్మారెడ్డి పసుల

దైవము మెచ్చదు

నయమము సర్వకాలముల నేస్తముగా యొనగూర్చు లాభముల్
వయసు నిమిత్తమేమియును పద్ధతితో నడవంగనట్టమున్
స్వయముగ సత్ఫలమ్ములను పాడును జేయదు వృద్ధి కోరెడిన్
దయయె హృదంతరమ్ముగల ధ్యానము దక్షత చెప్పు చిహ్నమై!!
నియమనిబంధనల్ దొలుత నిప్పులరీతిగ భీతిగూర్చు న
ధ్యయనము చేయ మానసము ధైర్యము పెంచును సోదరుండుగా
పయనము సాగు వేళలను పాత్రత పెంచును గౌరవమ్ముతో
నయన మనోహరమ్ము నవనాయక లక్షణముల్ వికాసమౌ!!
స్వీయనియంత్రణమ్ముకడువేదనదీర్చగనందదండతో
ధ్యేయము లక్ష్యసాధనము దివ్య విచక్షణ మార్గదర్శియై
సాయము జేయనో ప్రగతి శాసనమై పరిపూర్ణతత్త్వమై
కాయము వ్యక్తిలో నడత కాంక్షలగెల్పుకు తోడునీడయౌ!!
నియమము లేని జీవితము నిర్జలమైన తటాకమట్లుగా
వ్యయమును చేయుకాలమును వ్యర్థముగా ధనరాసులన్నినా
శ్రయమ